Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 98 మేడ్చల్ మల్కాజ్‌గిరి 30 ఏప్రిల్ 2023 ఆదివారం పేజీలు : 4

## కాంగ్రెస్‌లో చేరిన కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కోడలు

బెంగళూరు: కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కోడలు, మాజీ సీఎం బంగారప్ప కూతురు గీతా శివరాజ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కేపీసీసీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గీతా శివరాజ్ కుమార్‌కు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్.. కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా స్వాగతించారు. హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్ భార్య గీత కాంగ్రెస్ పార్టీలో చేరడం సర్వత్రా చర్చనీయాంశమైంది. శివమొగ్గ జిల్లా సొరబ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె తమ్ముడు మధు బంగారప్ప పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరాక గీత మాట్లాడుతూ, తన తమ్ముడు ఏ పార్టీలో ఉంటే తాను అక్కడే ఉంటానని పేర్కొన్నారు. వెంటనే ప్రచారానికి వెళతానని తెలిపారు. తన తండ్రి బంగారప్పను ముఖ్యమంత్రి చేసిన కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందని అన్నారు. సొరబ నియోజకవర్గ వ్యాప్తంగా తిరిగి ప్రచారం చేస్తానని చెప్పారు. భర్త శివరాజ్‌కుమార్ సినిమా షూటింగ్‌లో ఉన్నారని, అది ముగియగానే ప్రచారానికి వస్తారని తెలిపారు.

# సిట్టింగుల్లో గుబులు



## కేసీఆర్ హిట్ లిస్ట్ లో ఉన్న ఎమ్మెల్యేలు ఎవరు?

హైదరాబాద్ : బీఆర్ఎస్ జనరల్ బాడీ మీటింగ్ లో కేసీఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు పార్టీలో గుబులు రేపుతున్నాయి. ముఖ్యంగా ఇప్పటి వరకూ సిట్టింగుల కే సీట్లు అని భరోసానిచ్చిన కేసీఆర్ ఇప్పుడు పనితీరు బాగాలేని వారికి హెచ్చరికలు పంపడంతో అందరూ డోలాయమానంలో పడిపోయారు. సమావేశం పూర్తయిన తర్వాత ఎమ్మెల్యేల మధ్య ఇదే అంశం చర్చకు వచ్చినట్టు సమాచారం. సీఎం కేసీఆర్ ఎవరిని ఉద్దేశించి ఈ కామెంట్లు చేశారు. ఆయన లిస్టులో ఎవరెవరు ఉన్నారు. ఈ సారి టికెట్లు కట్ అయ్యేదెవరికి ? ఏ జిల్లాల్లో ఎంత మంది ఉన్నారు? అందులో మంత్రులు కూడా ఉన్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు బీఆర్ఎస్ లో చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పటికే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బీఆర్ఎస్ లో 25 మంది ఎమ్మెల్యేలకు టికెట్లు డౌట్ అంటూ అప్పట్లో బాంబు పేల్చారు. ఇప్పుడు కేసీఆర్ హెచ్చరికలతో ఆ లిస్టులో తమ పేర్లు ఉన్నాయా? అన్న చర్చ సాగుతోంది. దీని గురించే నేతలంతా ఒకరితో ఒకరు చర్చించుకుంటున్నట్టు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీఆర్ఎస్ లో 30-35 మంది ఎమ్మెల్యేల పనితీరుపై కేసీఆర్ అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. వారికి టికెట్ ఇవ్వనన్న వార్నింగ్ తోనే సిట్టింగులకు గుబులు పట్టుకుందని తెలుస్తోంది. ఆ 35 మంది ఎమ్మెల్యేలు పనితీరు మార్చుకోకపోతే వారికి టికెట్లు కట్ చేస్తామని కేసీఆర్ చెప్పారని.. ఆ విషయం బీఆర్ఎస్ లోని కొందరు పెద్దలకు తెలుసు అని సమాచారం.

ఇక సంక్షేమ పథకాల మంజూరు కోసం వచ్చే వారి వద్ద డబ్బులు వసూలు చేస్తున్న ఎమ్మెల్యేలు ఎవరో తెలుసు అంటూ కేసీఆర్ బాంబు పేల్చారు. కేసీఆర్ వద్ద 35 మంది ఎమ్మెల్యేల నివేదిక ఉందని సమాచారం. ఇదే విషయాన్ని సీఎం గురువారం జరిగిన జనరల్ బాడీ మీటింగ్ లో స్పష్టం చేసినట్టు పార్టీ లీడర్లు చెబుతున్నారు. ప్రగతి భవన్ లో ఉండే సన్నిహిత వర్గాల ద్వారా ఆ జాబితాలో తాము ఉన్నామా? లేదా? అనే విషయాన్ని ఆరాతీస్తున్నారు. తమ పట్ల నెగటివ్ రిపోర్ట్ ఉంటే మార్చుకుంటామని వేడుకుంటున్నారు. అలా వేడుకునే వారిలో కొందరు మంత్రులు కూడా ఉన్నట్లు సమాచారం.

## కర్నాటకలో ఎవరు గెలుస్తారంటే.... ఎస్ఎఎస్ గ్రూప్ సంచలన సర్వే





కర్నాటకలో మే నెలలో శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. పట్టుమంది పది రోజులు మాత్రమే ప్రచారానికి సమయం ఉంది. అధికార బీజేపీ ప్రధాన ప్రతిపక్షం అయిన కాంగ్రెస్ ఢీ అంటే ఢీ అంటున్నాయి. జేడీఎస్ కూడా తమకు ఉన్న పరిమితమైన బలంతో కింగ్ మేకర్ గా అవతరించాలని చూస్తోంది. ఎవరు గెలుస్తారు కన్నడ నాట ఏ పార్టీది అధికారం అన్న దాని మీద హైదరాబాద్ కి చెందిన ప్రముఖ సర్వే సంస్థ శ్రీ ఆత్మ సాక్షి గ్రూప్ (ఎస్ఏఎస్ ) సంచలన సర్వే విషయాలను బయటపెట్టింది. ఈ సంస్థ 2018లో నిర్వహించిన సర్వేలో కచ్చితమైన ఫలితాలు వచ్చాయి. ఆనాడు బీజేపీకి 102 నుంచి 105 సీట్ల మధ్యలో వస్తాయని అంచనా వేస్తే 104 సీట్లు వచ్చాయి. ఇపుడు చూస్తే అదే బీజేపీ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోందని సర్వే నివేదిక వెల్లడిస్తోంది. ఏప్రిల్ 26న విడుదల చేసిన లేటెస్ట్ సర్వేలో అనేక సంచలన విషయాలు చోటు చేఅసుకున్నాయి. బీజేపీకి గత అసెంబ్లీ టైం లో వచ్చిన ఓట్లు సీట్లు దారుణంగా తగ్గుతాయని ఎస్ అ ఎస్ గ్రూప్ సర్వే పేకొనడం విశేషం. మొత్తంగా చూస్తే బీజేపీకి 77 నుంచి 88 సీట్ల మధ్యలో వస్తాయని లెక్క తేల్చింది. అదే టైం లో కాంగ్రెస్ కి 115 నుంచి 127 మధ్యలో సీట్లు వస్తాయని పేర్కొంది. అంటే పూర్తి మెజారిటీతో కాంగ్రెస్ అధికారం అందుకుంటుంది అన్న మాట. మూడవ పార్టీలో బరిలో ఉన్న జేడీఎస్ కి 29 నుంచి 36 మధ్యలో సీట్లు రావచ్చు అని అంచనా కట్టింది. ఇతరులకు మూడు నుంచి ఎనిమిది సీట్లు వస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా కర్నాటకలో ఏ ఏ ప్రాంతాలలో ఏ పార్టీకి ఎంత బలం ఉంది ఎన్ని సీట్లు వస్తాయన్న దాని మీద కూడా ఎస్ ఏ ఎస్ గ్రూప్ సర్వే లోతైన విశ్లేషణ చేసింది. బెంగుళూరు అర్బన్ పరిధిలో 28 సీట్లు ఉంటేబీజేపీకి 12 నుంచి 14 మధ్యలో సీట్లు వస్తాయని అదే కాంగ్రెస్ కి 14 నుంచి 17 దాకా సీట్లు వస్తాయని జేడీఎస్ కి ఒకటి రెండు సీట్లు మాత్రమే వస్తాయని ఇంతరులకు ఒక్క సీటు అంటూ పేర్కొంది. ఓల్డ్ మైసూరులో మొత్తం 66 సీట్లు ఉంటే బీజేపీకి 8 నుంచి తొమ్మిది మాత్రమే వస్తాయని కాంగ్రెస్ కి 28 నుంచి 29 జేడీఎస్ కి28 నుంచి 30 దాకా సీట్లు ఇతరులకు రెండు నుంచి మూడు సీట్లు వస్తాయని పేర్కొంది. ముంబై కర్నాటకలో మొత్తం సీట్లు 44 ఉంటే బీజేపీకి 22 నుంచి 26 మధ్య సీట్లు కాంగ్రెస్ కి 26 నుంచి 28 మధ్యలో జేడీఎస్ కి ఒక్క సీటు ఇతరులకు ఒకటి నుంచి రెండు సీట్లు వస్తాయని పేర్కొంది. కోస్టల్ కర్నాటకలో మొత్తం సీట్లు 19 ఉంటే బీజేపీకి 10 నుంచి 12 కాంగ్రెస్ కి 9 నుంచి 11 జేడీఎస్ కి ఒకటి ఇతరులకు జీరో సీట్లు వస్తాయని అంచనా వేసింది. హైదరాబాద్ కర్నాటకలో మొత్తం సీట్లు నలభై ఉంటే బీజేపీకి 13 నుంచి 14 కాంగ్రెస్ కి 19 నుంచి 22 జేడీఎస్ కి ఒకటి ఇతరులకు ఒకటి సీట్లు వస్తాయని పేర్కొంది. సెంట్రల్ కర్నాటకలో మొత్తం సీట్లు మొత్తం సీట్లు 27 ఉంటే అందులో బీజేపీకి 12 నుంచి 13 కాంగ్రెస్ కి 19 నుంచి 20 జేడీఎస్ కి ఒకటి ఇతరులకు ఒకటి వస్తాయని ఎస్ ఏ ఎస్ గ్రూప్ సర్వే అంచనా వేసింది.

## తెలంగాణలో నాలుగు రోజులు భారీ వర్షాలు!

హైదరాబాద్: తెలంగాణలో రానున్న నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. నేడు, రేపు వడగండ్లతో కూడిన భారీ వర్షాలు పడతాయని తెలిపింది. ఈ రోజు దక్షిణ, తూర్పు



తెలంగాణ జిల్లాల్లో.. రేపు ఉత్తర, పశ్చిమ, మధ్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఉత్తర దక్షిణ ద్రోణి, కింది స్థాయి నుంచి వీస్తున్న గాలుల ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# రేవంత్ కు 90 సీట్లు కొట్టే సామర్థ్యం ఉందా?

హైదరాబాద్ : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చాలా ధీమాగా ముందుకు వెళుతున్నారు. ఆయన ప్రకటనల్లోనూ విశ్వాసం కనిపిస్తోంది. ప్రస్తుతం రెండు సార్లు గెలిచిన వ్యతిరేకతను అధిగమించాలని సీఎం కేసీఆర్ తీవ్రంగా సమాలోచనలు చేస్తున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఈసారి గెలవాలని ప్లాన్ చేస్తోంది. అయితే రాష్ట్రవ్యాప్తంగా నాయకత్వం సమస్య కార్యకర్తలు నేతలు లేకపోవడం ఆ పార్టీకి మైనస్ గా ఉంది. అదే కాంగ్రెస్ కు ఆ కొరత లేదు. రాష్ట్రమంతటా వారికి బలం బలగం ఉంది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ధీమాగా చెబుతున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి తీరుతానంటూ ప్రతిజ్ఞ చేస్తున్నాడు. ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ ర్యాలీలో పాల్గొన్న రేవంత్ రెడ్డి సభకు నిరుద్యోగులు పోటెత్తారు. ఏకంగా 50 లక్షల మంది నిరుద్యోగులతో కేసీఆర్ చెలగాటమాడుతున్నాడని రేవంత్ ఆరోపించారు. ఈ ఆరోపణలకు స్పందన బాగా వచ్చింది. 2 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కాంగ్రెస్ పట్టుబట్టడంతోనే 80వేల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. కానీ నోటిఫికేషన్లు ఇవ్వలేదని.. ఇచ్చిన పేపర్లు లీకయ్యాయని రేవంత్ ఫైరయ్యారు. అయితే గత పదేళ్లుగా అధికారంలో లేని కాంగ్రెస్ కు రేవంత్ రెడ్డి చీఫ్ గా నియమాకం అయిన తరువాత కేడర్లో కొంత ఉత్సాహం నెలకొంది. అధికార బీఆర్ఎస్ పై ఎదురుదాడికి పాల్పడింది రేవంత్ మాత్రమేనని కొందరు అంటున్నారు. ఈ తరుణంలో రేవంత్ తెలంగాణలోని నిరుద్యోగ భూ సమస్యలపై ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ప్రజల నుంచి మద్దతు పొందుతున్నారు. అందుకే ప్రతీ చోట రేవంత్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే నిరుద్యోగుల సమస్య తీరుస్తామని.. అందరికీ ఉద్యోగాలు ఇస్తామని.. ధరణిని రద్దు చేస్తామని హామీ ఇస్తున్నారు. ధరణిని రద్దు చేయడం ద్వారా ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అంటున్నారు. తెలంగాణ కాంగ్రెస్ ను పట్టాలెక్కించాలని ఊరు వాడా తిరుగుతూ పాదయాత్ర చేస్తున్నారు రేవంత్ రెడ్డి. మరోవైపు ఆయన పాదయాత్ర రాకుండా కాంగ్రెస్ సీనియర్లు కుట్రలు చేస్తున్నారని రేవంత్ వర్గం ఆరోపిస్తోంది. అయితే ఇప్పటికే సీనియర్లకు భయపడి మాణిక్యం ఠాగూర్ వైదొలగగా థాక్రే కొత్త ఇన్ చార్జీగా వచ్చారు. అయితే ఆయన దూకుడు ఇప్పుడు కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ కు కారణం అవుతోంది. రేవంత్ రెడ్డి పాదయాత్రకు జనస్పందన వెల్లువెత్తుతోంది. అందుకే తనకు తానే సీఎంగా ప్రొజెక్ట్ చేసుకుంటున్నాడు రేవంత్ రెడ్డి. పాదయాత్రలో మీడియా ప్రతినిధులతో పరోక్షంగా చెప్పుకుంటున్నాడు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. తానే సీఎం అన్న విషయాన్ని క్లారిటీగా చెప్పేస్తున్నాడు. ఈ క్రమంలోనే తాజాగా కేసీఆర్ పై వ్యతిరేకతనే తమకు 90 సీట్లు తెచ్చిపెడుతుందని రేవంత్ రెడ్డి భరోసాగా చెబుతున్నారు.



# సంపాదకీయం

## ఎవరీ గ్యాంగ్ స్టర్ ఆనంద్ మోహన్? ఇంతకు దిగజారాలా నితీశ్?

అత్యుత్తమ స్థానాల్లో ఉండి.. గౌరవ మర్యాదలకు కొదవ లేని వేళలో.. దశాబ్దాల తరబడి సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతుల్ని.. గౌరవ మర్యాదల్ని పణంగా పెట్టేందుకు అస్సలు ఇష్టపడరు. కానీ.. బిహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించి దారుణమైన విమర్శల్ని ఎదుర్కొంటున్నారు. తాజాగా ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గురించి తెలిసిన వారు.. మరీ ఇంత నీతిమాలిన పని చేయటమా? అంటూ విస్మయానికి గురి అవుతున్నారు. కాలం కలిసి వచ్చి.. అవకాశం ఉండాలే కానీ ప్రధానమంత్రి రేసులో ఉండే అతికొద్ది మంది ముఖ్యమంత్రుల్లో నితీశ్ కుమార్ ఒకరు. అలాంటి ఆయన.. తనకున్న గౌరవ మర్యాదలకు భంగం వాటిల్లేలా వ్యవహరిస్తూ తీసుకున్న వివాదాస్పద నిర్ణయం హాట్ టాపిక్ గా మారింది. ఒక ఐఏఎస్ అధికారిని నడిరోడ్డు మీద కారులో నుంచి బయటకు లాగి దాడి చేసిన ఉదంతంలో ప్రాణాలు తీసిన ఒక గ్యాంగ్ స్టర్ విడుదల కోసం నిబంధనల్ని సవరించిన నితీశ్ సర్కారు తీరు ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఇంతకీ ఆ గ్యాంగ్ స్టర్ ఎవరు? ప్రాణాలు కోల్పోయిన ఆ ఐఏఎస్ అధికారి ఎవరు? అంతటి దారుణ నేరానికి పాల్పడి యావజ్జీవ కారాగార శిక్షను అనుభవిస్తున్న అతడ్ని విడుదల చేసేందుకు నితీశ్ సర్కారు చేసిన నీతిమాలిన పని ఏమిటి? అన్న వివరాల్లోకి వెళితే.. సుమారు ముప్పై ఏళ్ల క్రితం.. అంటే 1994లో లాలూ ప్రసాద్ యాదవ్ సీఎంగా ఉన్నప్పుడు బిహార్ పీపుల్స్ పార్టీ నేత ఛోటన్ శుక్లాను పోలీసులు ఎన్ కౌంటర్ చేశారు. దీంతో బిహార్ వ్యాప్తంగా అల్లర్లు చోటు చేసుకున్నాయి. మరణించిన నేత ప్రాతినిధ్యం వహించే బీపీపీ వ్యవస్థాపకుడు ఆనంద్ మోహన్ పిలుపు ఇచ్చి మరీ వేలాది మంది పార్టీ కార్యకర్తలతో కలిసి అంతిమ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా 35 ఏళ్ల ఐఏఎస్ అధికారి జి. క్రిష్ణయ్యను కారులో నుంచి బయటకు లాగి రాళ్లతో దాడి చేసి కొట్టారు. ఈ దాడిలో ఆ అధికారి అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది. క్రిష్ణయ్య ఎవరో కాదు.. ఉమ్మడి ఏపీలోని మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన తెలుగు వ్యక్తి. ఆందోళనకారుల్ని రెచ్చగొట్టి అధికారి ప్రాణాలు పోయేందుకు కారణమైన ఆనంద్ మోహన్ మీద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఆయనకు ఉరిశిక్ష పడింది. జైల్లో ఉన్న సమయంలో ఎంపీగా పోటీ చేసి.. ఎన్నికల్లో విజయం సాధించారు. ఎంపీగా ఉన్న వేళలోనే అతనికి ఉరిశిక్ష విధించటంతో పదవిని కోల్పోయారు. ఎంపీగా వ్యవహరించిన ఒక రాజకీయ నేతకు ఉరిశిక్ష పడిన మొదటి ఉదంతం అదే. ఆ తర్వాత అతనికి పడిన ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు. దీన్ని సుప్రీం సైతం సమర్థించింది. అలా.. రెండు దశాబ్దాలకు పైనే జైల్లో ఉంటున్నాడు. ఇదిలా ఉంటే.. ఏప్రిల్ 10న నితీశ్ సర్కారు బిహార్ జైలు మాన్యువల్ 2012కు సవరణలు చేసింది. కొత్త సవరణ ప్రకారం... విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల హత్య కేసుల క్లాజును సవరించింది. సవరణకు ముందు ఉన్న క్లాజ్ ప్రకారం.. ఆనంద్ మోహన్ విడుదలకు అవకాశం లేదు. నిబంధనను మార్చిన నేపథ్యంలో అతడి విడుదలకు మార్గం సుగమమైంది. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. విపక్షాలు సైతం పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఇలాంటి వేళ.. ఒక అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆనంద్ మోహన్ కొడుకు కమ్ ఆర్జేడీ ఎమ్మెల్యే చేతన్ ఆనంద్ ఎంగేజ్ మెంట్ కార్యక్రమం ఇటీవల జరిగింది. దీనికి పెరోల్ మీద బయటకు వచ్చారు ఆనంద్ మోహన్. ఈ ఎంగేజ్ మెంట్ కు ముఖ్యమంత్రి నితీశ్.. ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ తో సహా పలువురు రాజకీయ నేతలు హాజరయ్యారు. ఈ ఎంగేజ్ మెంట్ వేళలోనే ప్రభుత్వం నిబంధనలు మారుస్తూ జీవో జారీ చేయటం గమనార్హం. చూస్తుంటే.. ఆర్జేడీ ఎమ్మెల్యే పెళ్లికి నిబంధనలు మార్చేసి మరీ నితీశ్ గిఫ్టు ఇచ్చారా? అన్న భావన కలుగక మానదు.

# ఉపాధి వక్రమార్గం



నిర్మల్ : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనిలేని నిరుపేద కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్న బృహత్‌లక్ష్యంతో ఏర్పాటు చేసిన గొప్ప కార్యక్రమం. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరుచూస్తే ఎక్కడ సందు దొరికినా అందిన కాడికి దోచుకోవడం లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధికూలీల నుంచి దోపిడీకి కొత్తమార్గాలను వెతికిపట్టి మరీ వారి నుంచి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తమకు కొంతలాభం జరుగుతుండడంతో ఉపాధికూలీలు సైతం తమను పర్యవేక్షించే మెట్లతో పాటు చేసిన పనిని కొలిచి నిర్ధారించే టెక్నికల్ అసిస్టెంట్‌ల చేతివాటానికిసై అంటున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగం జిల్లాలోని అనేక మండలాల్లో కొంతకాలంగా యథేచ్ఛగా జరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ కింది నుంచి పై దాక అన్నట్లు అందరికీ చమురు అందుతుండడంతో ఉపాధి లెక్కలు కాకిలెక్కలుగా మారుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వారికి వంద.. వీరికి రెండొందలు..ఉపాధిహామీ పథకంలో కూలీలు చేసిన పనులను పర్యవేక్షించే బాధ్యత గతంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు చూసేవారు. వారు తీవ్రమైన అవినీతి చేస్తున్నారన్న ఆరోపణల మేరకు ప్రభుత్వం వారిని పక్కన పెట్టింది. మళ్లీ విధుల్లోకి వారిని తీసుకోవాలన్న ప్రభుత్వనిర్ణయం ఇంకా ఆచరణ దాల్చలేదు. ఇప్పుడు ఉపాధి కూలీల పనుల బాధ్యతలను మెట్లు చూస్తున్నా రు. కూలీలగ్రూపునకు ఒక మెట్‌ను నియమించి పనులు చేయిస్తున్నారు. వీరిపై టెక్నికల్ అసిస్టెంట్‌లు పర్యవేక్షిస్తున్నారు. వారిపై మండలానికి ఒక ఏపీఓ.... మండల అభివృద్ధి అధికారులు పర్యవేక్షించే బాధ్యతలను చూస్తున్నారు. అయితే అనేక మండలాల్లో ఉపాధి కూలీల నుంచి మెట్లు ఒక్కొక్కకూలీ నుంచి ప్రతివారానికి రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ లెక్కన ఒక్కోకూలీ నుంచి నెలకు సుమారు రూ.500 వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదీ సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్‌ల కనుసన్నల్లోనే మెట్లు కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న విమర్శలు గుప్పుమంటున్నాయి. కూలీలు మెట్లకు వారానికి రూ. 100 ఎందుకు ఇవ్వాల్సి వస్తుందంటే.. కూలీలు తమకు చూపిన పని చేసే ప్రదేశంలో రోజు రూ.50 నుంచి రూ.100 పనిచేస్తే మెట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు కూలీ చేసిన పనిని సుమారు 180 నుంచి రూ. 200 లు పని చేసినట్లు రికార్డు చేసి కూలీలకు డబ్బు లు జమ చేస్తున్నారు. దీంతో అటుఇటుగా తమ కు రోజుకు రూ. 100 అదనపు లాభం చేకూరుతున్న కారణంగా వారానికి రూ.100 పై వాడికి ఇస్తే ఉభయ తారకంగా లాభం ఉంటుందన్న ఆశకూలీల్లో పెరిగిపోతోంది. ముఖ్యంగా చిన్న వర్షాలకే నిండిపోయే కుంటలు, చెరువుల్లో ఇలాంటి అక్రమపనుల వ్యవహారం ఎక్కువగా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి. చూసేవాడే లేదు కదా అన్నరీతిగా ఈ దందా సాగుతోందని సమాచారం. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ ఈ తరహా ఉపాధి నిధుల దోపిడీ సాగుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో ఉపాధి కూలీల లెక్క ఇదీజిల్లాలోమొత్తం 1.80లక్షల జాబ్‌కార్డులున్నట్లు అధికారులు చెబుతున్నా రు. వీటిలో 1.31 లక్షల యాక్టివ్‌కార్డులు ఉండగా మొత్తం 2.46 లక్షల ఉపాధి కూలీలున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటిదాక ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో 1.57 లక్షల మందికి పని కల్పించారు. ఇప్పటి దాక రూ.34.39 కోట్ల విలువైన నిధులను కూలీలకు చెల్లించారు. సగటున ఒక్కొకూలీకి రూ.160 చొప్పున నగదు చెల్లింపులు చేసినట్లు అధికారుల లెక్కల్లో ఉంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉందన్న అభిప్రాయాలు ఉపాధి హామీ యంత్రాంగంలోనే ఉన్నాయి. చేయనిపనిని చేసినట్లుగా.. తక్కువ పనిని ఎక్కువ చేసినట్లు రికార్డులు రాసి ఉపాధి నిధులు కొల్లగొడుతున్నారన్న ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో నిఘావిభాగం అధికారులు తనిఖీలు నిర్వహిస్తే ఈ అక్రమభాగోతం వెలుగుచూసే అవకాశం ఉంది. చూడడానికి రూ. 100, రూ. 200 అన్నట్లుగానే ఉన్నప్పటికి జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఈ తతంగం లెక్కలు ఆరా తీస్తే కోట్ల రూపాయల ఉపాధి నిధు లు మెట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఆ పై అధికారులు కలిసి వాటాలు పం చుకుంటున్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లా యంత్రాం గం దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. టెంట్లు, నీళ్లు ఎక్కడఉపాధి హామీ పనులు చేపట్టే చోట కూలీలకు ఎండదెబ్బ తగలకుండా చూడడంతో పాటు ఎప్పటికప్పుడు దాహార్తిని తీర్చే విధందా టెంట్‌లతో పాటు నీటిసౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ముషారఫ్ ఆలీ వేసవిసీజన్ మొదట్లోనే ఆదేశాలు ఇచ్చారు. అయితే తొలుత కొద్ది రోజు లు అక్కడక్కడ టెంట్‌లు, నీళ్లు కనిపించినప్పటికీ క్రమంగా ఎక్కడా కూడా టెంట్‌లు, నీళ్ల దాఖలాలు కనిపించడం లేదు. ఇందుకు ప్రత్యేకంగా అన్ని మండలాలకు నిధులు కూడా కేటాయించారని సమాచారం. ఈ నిధులుటెంట్‌లు,

నీళ్లకు ఖర్చు పెట్టకుండా టెక్నికల్ అసిస్టెంట్‌లస్థాయి నుంచి మండలస్థాయిలో పని చేసే ఏపీఓలు, ఎంపీడీఓలు ఇతర అధికారులతో పాటు జిల్లా కార్యాలయం స్థాయిదాక కాజేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై సమగ్ర విచారణ జరపాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్రమాలు తేలితే చర్యలుఉపాధి హామీ పథకంలో అక్రమాలు తేలినట్లయితే సంబంధిత సిబ్బందిపై కఠినచర్యలు తీసుకుంటాము. ఉపాధిహామీ పథకంలో అక్రమాలకు ఆస్కారం లేదు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టంను అమలు చేస్తున్నాము. క్షేత్రస్థాయిలో తనిఖీలు జరిపి అక్రమాలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటాము.

# కాల్వలు అధ్వానం

మహబూబ్‌నగర్ :ఉమ్మడి జిల్లాలోని సాగునీటి కాల్వల కింద చివరి ఆయకట్టుకు నీరందడం ప్రశ్నార్థకంగా మారింది. కాల్వలకు మరమ్మతు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఈ దుస్థితి ఏర్పడింది. వనపర్తి జిల్లాలో జూరాల ప్రాజెక్టు కాల్వల మరమ్మతు పనులు ఇప్పుడిప్పుడే చేపట్టగా, కల్వకుర్తి, భీమా ఫేజ్ 2 పనులు చేపట్ట లేదు. జోగుళాంబ గద్వాల జిల్లాలో నీటి లీకేజీలతో జూరాల కాల్వల మరమ్మతునకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో కేఎల్‌ఐ కాల్వల మరమ్మతు ఊసే ఎత్తడం లేదు.– ఆంధ్రజ్యోతి, వనపర్తి

జూరాల, కేఎల్‌ఐ, భీమా పథకాల కింద కాల్వల మరమ్మతు సరిగా చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. ప్రియదర్శిని జూ రాల ప్రాజెక్టు కింద వనపర్తి జిల్లాలో 100 కిలో మీటర్ల మేర ఎడమ కాలువ ఉంది. దీని కింద 40 డిస్ట్రిబ్యూ టరీలు ఉన్నాయి. వానాకాలంలో 75 వేల ఎకరాలకు, యాసంగిలో 35 వేల ఎకరాల వరకు సాగునీరు అందుతోంది. గతేడాది వరకు యాసంగి పంట పూర్తయిన తర్వాత కాలువ మరమ్మతు పనులను ఎప్పటికప్పుడు చేపట్టారు. నందిమల్ల డివిజన్ ఆఫీసు పెబ్బేరుకు షిఫ్ట్ కావడంతో గుత్తేదారులు ముందుకు రాక, ఇప్పటి వరకు పనులు చేపట్ట లేదు. కాలువ మరమ్మతు కోసం జీవో 45 ద్వారా రూ.25 లక్షలు మంజూరు కాగా, ఇప్పుడు ప్రారంభించారు. అయితే వానాకాలం దగ్గర్లో ఉండటంతో మైనర్ పనులు మాత్రమే చేపడుతున్నారు. మేజర్ పనులకు మరిన్ని నిధులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ కాలువకు వీపనగండ్ల మండలంలో 2020లో సంపత్‌రావు పల్లి వద్ద గండిపడింది. రూ. 20 లక్షలతో మరమ్మతులు చేశారు. పెబ్బేరు మండలం చెలిమిల్ల వద్ద, శేరుపల్లి వద్ద కూడా గతంలో గండిపడింది. ప్రస్తుతం కాలువ బాగానే ఉంది. కానీ చాలాచోట్ల పూడిక పేరుకుపోయి, మైనర్ మరమ్మతులు చేయాల్సి ఉంది.ఇక భీమా కాలువకు సంబంధించి చాలాచోట్ల గండ్లుపడుతున్నాయి. కొత్తకోట నుంచి వీపనగండ్ల వరకు సుమారు 42 కిలో మీటర్ల మేర భీమా ఫేజ్ 2లో కాలువలు ఉన్నాయి. ఇప్పటివరకు రాయినిపేట వద్ద ఓసారి కాలువకు గండిపడగా రూ.13 లక్షలతో మరమ్మతు చేశారు. అలాగే వీపనగండ్ల మండలంలో దాదాపు 20 చోట్ల మేజర్, మైనర్ గండ్లు పడ్డాయి. 2020లో పడిన గండ్లకు రూ.20 లక్షలు ఖర్చు చేశారు. బొల్లారం సమీపంలో కాలువకు గండిపడి దాదాపు 883 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. ఇక కేఎల్‌ఐ కింద కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. కాలువలు తవ్వినా సీసీ లైనింగ్ చేయకపోవడంతో పలుచోట్ల తరచూ గండ్లు పడుతున్నాయి. పానగల్ మండలంలోని కాలువల్లో జమ్ము, పూడిక పేరుకుపోయింది. రెండేళ్ల కిందట కొంతమేర తొలగించినా, పరిస్థితి అలాగే ఉంది. ఈ మండలంలో ఏటా పలుచోట్ల కాలువలు తెగిపోయి, పంట నష్టం జరుగుతోంది. కోడేరు మండలం నుంచి పానగల్ వరకు దాదాపు డీ8 కెనాల్ 34 కిలోమీటర్ల మేర ఉంది. గత సంవత్సరం 8.2 కిలోమీటర్ వద్ద గండి పడింది. పానగల్ మండలం కిష్టాపూర్, గోప్లాపూర్ వద్ద రెండుసార్లు గండ్లుపడ్డాయి. కాలువలు తెగిన సమయంలో మాత్రమే మరమ్మతులు చేస్తున్నారే తప్ప, శాశ్వతంగా గండ్లు పడకుండా చేపట్టాల్సిన పనులపై దృష్టి పెట్టడం లేదనే విమర్శలున్నాయి. చాలాచోట్ల కాలువలకు సీసీ లైనింగ్ చేయకపోవడం వల్ల ఎత్తిపోతల పథకాల నుంచి నీరు వచ్చే సమయంలో, వర్షాలు అధికంగా కురిసినప్పుడు కాలువలకు గండ్లు పడుతున్నాయి. ఏటా కాల్వలకు మైనర్, మేజర్ మరమ్మతులు చేయడంతో పాటు ఉపాధి హామీ పథకంలో జమ్మును తొలగించాలని, అప్పుడు నీళ్లు సాఫీగా వెళ్లడానికి వీలవుతుందని రైతులు అంటున్నారు.

కల్వకుర్తి ఎత్తిపో తల పథకం కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది.



వానకాలం ప్రారంభానికి ముందే కాల్వల మరమ్మతుపై దృష్టి సారించాల్సిన ఇరిగేషన్ శాఖ చేతులు ఎత్తేయడంతో చివరి ఆయకట్టు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గతంలో కాల్వల మరమ్మతు పనుల బిల్లులు రాకపోవడంతో పనులు చేయడానికి కాం ట్రాక్టర్లు ముందు కు రావడం లేదు. నాలుగు లక్షలా 30 వేల ఎకరాలకు సాగు నీరు అందించాలనే సంకల్పంతో కల్వకుర్తి, అచ్చంపేట బ్రాంచ్ కెనాళ్లను దాదాపు 463 కిలోమీటర్ల పొడవున నిర్మించారు. కేఎల్‌ఐ ప్రధాన కాల్వలకు లైనింగ్ పనులు చేయకుండా ఆదరాబాదరాగా తవ్వకాలు చేపట్టడంతో నీళ్లు సరిగా పారడం లేదు. గుడిపల్లి రిజర్వాయర్ నుంచి అచ్చంపేట, కల్వకుర్తి బ్రాంచ్ కెనాళ్ల ద్వారా ఆయకట్టుకు నీరందించే క్రమంలో కాల్వల పటిష్టతను పట్టించుకోకపోవడంతో కోడేరు మండలం నాగులపల్లి, పస్పుల బ్రాంచ్ కెనాల్ గతంలో తెగి పంటలకు నష్టం వాటిల్లింది. వంగూరు మండలం ఉల్లంపల్లి వద్ద కెనాల్ పరిస్థితి దయనీయంగా ఉండగా, డీ–82 కింద వెల్దండ శివారులో 50 ఎకరాల పంట నీట మునిగింది. బ్రాంచ్ కాల్వల్లో విపరీతంగా జమ్ము పెరిగింది. అధికారుల స్పందించకపోవడంతో కాల్వల్లో రైతులే స్వచ్ఛందంగా జమ్ము, తుమ్మ చెట్లను తొలగించుకుంటున్నారు.

పూడికతీతకు కష్టాలుగద్వాల: జూరాల ప్రాజెక్టు కుడి కాలువలో పూడికతీతకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టు కింద ఏప్రిల్ వరకు సాగునీరు అందించడంతో కాలువ పూర్తిగా ఎండి పోలేదు. దానికితోడు జూరాల కాలువ గేట్లు, జములమ్మ రిజర్వాయర్ గేట్ల నుంచి నీరు లీక్ అవుతుండటంతో కాలువ ఎండ లేదు. దాంతో జేసీబీ సహాయంతో కాల్వలో పూడిక తీసినా, ఇంకా మిగులుతోంది. దాదాపు రూ. కోటితో ఈ పనులు చేపట్టారు. పది రోజుల కిందట కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. 0 కిలో మీటరు నుంచి నాల్గవ కిలో మీటరు, 21వ కిలో మీటరు నుంచి 29వ కిలో మీటరు మధ్య ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. 200 మీటర్లకు ఒక ర్యాంపును ఏర్పాటు చేసి ట్రాక్టర్ల సహాయంతో బురదను బయటకు తీస్తున్నారు. పూడికతీత సందర్భంగా వచ్చే ఊట నీరుతో పాటు కాలువలోని నీళ్లు ర్యాంపులను తడుపుతున్నాయి. దీంతో బురద లోడుతో వచ్చే ట్రాక్టర్‌లు తడిచిన ర్యాంపుల మీదుగా గడ్డపైకి ఎక్కలేకపోతున్నాయి. 15వ కిలో మీటరు నుంచి 21వ కిలో మీటరు మధ్య దాదాపు ఐదు కిలోమీటర్ల మేరకు జూరాల కాలువలో నీళ్లు నిలిచిపోయాయి. జములమ్మ రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండి ఉండటంతో ఆ నీళ్లు వెనక్కి వచ్చి కాల్వలో నిలిచాయి. దాంతో అక్కడ జములమ్మ రిజర్వాయర్‌లో కొంత నీటిని తగ్గిస్తే తప్ప అక్కడ పని చేయలేని పరిస్థితి ఉంది. జూరాల కాలువకు నీటిని నిలుపుదల చేసిన రోజు గేట్ల నుంచి లీకేజీలు రాకుండా చేసినట్లయితే ఈ పాటికి కాలువ ఎండిపోయి పూడిక పూర్తి స్థాయిలో బయటకు వచ్చేది. పూడిక తీయడానికి ఇబ్బందులు ఎదురవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరందడం ప్రశ్నార్థకంగా మారింది. కాలువలో నిలిచిపోయిన నీళ్లును మళ్లించి కాలువను డ్రై చేస్తామని, అప్పుడే పూడికను తొలగిస్తామని పీజేపీ ఈఈ జహీరుద్దీన్ తెలిపారు.

# నెలరోజులైనా కల్లాల్లోనే వడ్లు!

హుస్నాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వడ్లను కొంటదో లేదోననే అనుమానంతో ఉన్న రైతులు వరి సాగు తగ్గించారు. నాట్లు వేసినవారు కూడా వడ్లు ఎలా అమ్మాలా అని రందిపడ్డారు. చివరకు కొనుగోలు కేంద్రాలను తెరుస్తామని ప్రభుత్వం చెప్పడంతో సంబరపడ్డారు. హుస్నాబాద్ మండలంలో 10,500 ఎకరాల్లో వరి నాట్లు వేశారు. 1.20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. మండలంలో 16 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 90వేల క్వింటాళ్ల పంటను సేకరించారు. ఇంకా 30 వేల క్వింటాళ్ల పంటను సేకరించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు 5 కేంద్రాల పరిధిలో వంద శాతం సేకరణ పూర్తిచేసి సెంటర్లను మూసివేశారు. ప్రస్తుతం 11 కేంద్రాల పరిధిలో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయి. నెల రోజులుగా పడిగాపులువర్షాకాలం ముంచుకొస్తున్నా ఇంకా వడ్ల కొనుగోళ్లు పూర్తికాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అష్టకష్టాలు పడి పంటను అమ్మకానికి తీసుకువస్తే నెల గడుస్తున్నా కాంటా చేయక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్కో రైతు నెల రోజులుగా ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు. వర్షం ఎప్పుడు వస్తుందోనని దిగులు చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదనంగా తూకంకొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయడానికి సెంటర్ నిర్వాహకులు చుక్కలు చూపిస్తున్నారు. గన్నీ సంచి బరువు 590 గ్రాములు కలుపుకుని ప్రతీ బస్తా 40.590 కిలోలు మాత్రమే తూకం వేయాల్సి ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను దోచుకుంటున్నారు. ఒక్కో బస్తాలో 42 కిలోల నుంచి 43.5 కిలోల వరకు తూకం వేస్తున్నారు. ఈమేరకు క్వింటాలుకు ఆరు కిలోల వరకు అదనంగా తూకం వేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించినవారికి గన్నీ సంచులు ఇవ్వకుండా, ధాన్యం తూకం వేయకుండా జాప్యం వేధిస్తున్నారు. కేంద్రం నుంచి మిల్లుకు ధాన్యం తరలించడానికి స్వయంగా వాహనాన్ని సమకూర్చుకున్న వారికి మాత్రమే తూకం వేస్తున్నారు. కేంద్రాల నుంచి మిల్లులకు వెళ్లిన ట్రాక్టర్లు, లారీలు నాలుగు రోజులకు గానీ తిరిగి రాకపోవడంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. మిల్లుల వద్ద వేచిఉన్న నాలుగు రోజులకు వాహన యజమానులు రైతుల వద్ద చార్జీలు వసూలు చేస్తున్నారు. ముంచుకొస్తున్న వర్షాకాలంహుస్నాబాద్ మండలంలో పోతారం(ఎస్), మహ్మదాపూర్, నాగారం, రాములపల్లి, గాంధీనగర్, పందిల్ల, పొట్లపల్లి తదితర గ్రామాల్లో 40 శాతం వరకు ధాన్యం సేకరించాల్సి ఉన్నది. రోహిణీ కార్తె మొదలు కావడంతో ఉరుములు, మెరుపులతో వర్షాలు వస్తున్నాయి. వర్షాలకు ధాన్యం కుప్పలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా టార్పాలిన్ కవర్లు లేకపోవడంతో దిగులు చెందుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలు తీర్చాలని రైతులు కోరుతున్నారు.

# కాంగ్రెస్‌లో రచ్చబండ!

సంగారెడ్డి: వరంగల్ డిక్లరేషన్‌ను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు పీసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ చేపట్టిన రైతు రచ్చబండ కార్యక్రమం సంగారెడ్డి జిల్లాలో పార్టీలోని లుకలుకలను బయటపె ట్టింది. జిల్లాలో ఐదు నియోజకవర్గాలుంటే రెండు నియోజకవర్గాల్లోనే కార్యక్రమం కొనసాగుతున్నది. జహీరాబాద్‌లో కాంగ్రెస్‌లోని రెండు వర్గాలు పోటాపోటీగా నిర్వహిస్తున్నాయి. అందోలులో పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ పట్టించుకోవడమే లేదు. పటాన్‌చెరు నియోజకవర్గంలో రైతులే లేరని రచ్చబండ నిర్వహించడం లేదు. సంగారెడ్డి ఎమ్మెల్యే, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి రచ్చబండకు బదులుగా 'జనంలోకి జగ్గారెడ్డి' పేరుతో కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ నెల 27 నుంచి జూన్ 21 వరకు జరగాల్సిన కార్యక్రమం వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో చూడాల్సిందే! జూన్ 21 వరకు రైతు రచ్చబండ కాంగ్రెస్ వరంగల్‌లో ఇటీవల నిర్వహించిన రాహుల్‌గాంధీ సభలో వరంగల్ డిక్లరేషన్ విడుదల చేసింది. పార్టీ అధికారంలోకి వస్తే రైతుల కోసం చేపట్టే కార్యక్రమాలను పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ వివరాలను రైతుల వద్దకు తీసుకు వెళ్లేందుకు ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు రైతు రచ్చబండ పేరిట కార్యక్రమాలను రూపొందించారు. ఈ డిక్లరేషన్‌లో ప్రకటించిన వాటిలో కౌలు రైతులకు రూ.15వేల సాయం, భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు, రూ.2లక్షల రైతుల రుణమాఫీ ఏక కాలంలో చేయడం, ధరణి పోర్టల్ వద్దు అన్ని పంటకు గిట్టుబాటు ధర కల్పించడం వంటి హామీలెన్నో ఉన్నాయి.

జహీరాబాద్‌లో ఎవరి దారి వారిదే!జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోయింది. మాజీ మంత్రి, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ జె.గీతారెడ్డి నాయకత్వంలో ఓ వర్గం, పార్టీ నాయకుడు నరోత్తమ్ ఆధ్వర్యంలో మరో వర్గం పని చేస్తున్నది. గీతారెడ్డి వర్గంలో ఎంపీపీ అధ్యక్షులు గిరధర్‌రెడ్డి(జహీరాబాద్), మాధవి (కోహీర్), జడ్పీటీసీ సభ్యురాలు వినీల (ఝరాసంగం) తదితర నాయకులు ఉన్నారు. మరోవైపు నరోత్తమ్‌కు మద్దతుగా డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ బాగారెడ్డి తనయుడు జైపాల్‌రెడ్డి, కోహీర్ జడ్పీటీసీ రాందాస్, ఝరాసంగం ఎంపీపీ దేవదాస్ ఉన్నారు. ఈ రెండు వర్గాలు ఎవరికి వారే రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఒక వర్గం నిర్వహించే కార్యక్రమాలకు మరో వర్గం హాజరవడం లేదు. నారాయణఖేడ్‌లో ఐక్యంగానారాయణఖేడ్ నియోజకవర్గ కాంగ్రెసలో గతంలో ఉన్న రెండు వర్గాలు ఈసారి ఒక్కతాటిపైకి వచ్చాయి. పీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్ స్థానికంగా లేరు. ఆయన వర్గీయులు, పీసీసీ సభ్యుడు డాక్టర్ సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి కలిసి గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రైతులను కలిసి కాంగ్రెస్ ప్రకటించిన పథకాలను వివరిస్తున్నారు.

రైతులే లేరంట!పటాన్‌చెరు నియోజకవర్గంలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, జిన్నారం మండలాలు పారిశ్రామిక ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో రైతులు లేరనే కారణంతో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు. గుమ్మడిదల మండల కేంద్రంలో మాత్రం ఇటీవల రచ్చబండ నిర్వహించగా, పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్‌కుమార్, అసెంబ్లీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు. మిగిలిన మండలాల్లోనూ రైతులు ఉన్నా రచ్చబండ నిర్వహించేందుకు కాంగ్రెస్ వర్గాలు ఆసక్తి చూపడం లేదు.ఊగిసలాటలో దామోదర్?అందోలు నియోజకవర్గంలో పార్టీ నేత మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ రాజకీయంగా ఊగిసలాటలో ఉన్నట్టు తెలుస్తున్నది. రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నాయకుల్లో ఒకరైన దామోదర్ నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల అమలుపై ఆసక్తి చూపడం లేదు. హైదరాబాద్‌లో ఉండే ఆయన నియోజకవర్గంలో కార్యకర్తల వ్యక్తిగత కార్యక్రమాలకు హాజరవడం మినహా పార్టీ పటిష్టతకు ప్రయత్నించడం లేదని విమర్శలు వస్తున్నాయి. నియోజకవర్గానికి చెందిన డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సిద్దన్నపాటిల్ ఇటీవలే పార్టీని వీడి టీఆర్‌ఎసలో చేరినా.. ఆయన వారించ లేదని ప్రచారం జరుగుతున్నది. ఈ నేపథ్యంలో పార్టీ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రైతు రచ్చబండపై చొరవ చూపించకపోవడంపై పార్టీ శ్రేణులు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల నాటికి ఆయన కాంగ్రెసలోనే ఉంటారా? లేక పార్టీ మారుతారా.. అన్న చర్చ జరుగుతున్నది. టీఆర్‌ఎస్ నియోజకవర్గ ముఖ్య నాయకుడొకరితో దామోదర్ తరచుగా మాట్లాడుతున్నారని తెలుస్తున్నది. అదే సమయంలో బీజేపీ పట్ల కూడా ఆయన సానుకూలంగా ఉన్నారని కూడా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. బీజేపీకి యువత పెద్ద సంఖ్యలో ఆకర్షితులవుతున్నారని ఆయన ఇటీవల తనను కలిసిన నేతలతో అన్నట్టు తెలిసింది.

# పత్తి వైపే పరుగులు!



ఆదిలాబాద్ : ఈ ఏడాది పత్తి పంట సాగు వైపే రైతులు మళ్లీ పరుగు లు తీస్తున్నారు. జిల్లా సాగు భూమి విస్తీర్ణం 5 లక్ష ల 71 వేల ఎకరాలు కాగా ఈ సారి 3లక్షల 95వేల 200 ఎకరాలలో పత్తిపంట సాగయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. 2022-23సంవత్సరానికి ఖరీఫ్ పంటల సాగుకు వ్యవసాయ శాఖ అధి కారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. గతేడా కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగనుంది. సుమారు 20 వేల హెక్టార్ల విస్తీ ర్ణం అదనంగా పెరగనుందన్న అంచనా వేస్తున్నారు. మూడు నాలుగేళ్లుగా విస్తీర్ణం తగ్గినా గత ఏడాది ధరలు పుంజుకోవడంతో ఈసారి సాగుపై రైతులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ప్రధానంగా సోయా, జొన్న జిల్లాలో ప్రధానంగా సోయా పంట 88వేల920 ఎకరాలు, కంది 61 వేల 750, జొన్న 4,446, వరి 2వేలు ఎకరాలలో సాగుకాగా మిగిలిన ఎకరాలలో ఇతర పంటలను సాగు చేయనున్నారు. మొత్తం 5 లక్షల 71 వేల ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉంది. గత కొన్నేళ్లుగా సంప్రదాయ పంటల సాగుతో రైతులకు భారీ నష్టాలు వస్తున్నాయని భావించిన ప్రభుత్వం గత ఏడాది నుంచి పత్తి పంట సాగును ప్రోత్సహిస్తూ వస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలైన సో యా, కంది పంటల సాగు తగ్గుతూ వస్తోంది. పంట చేతికి వచ్చే స మయంలో సోయా, కంది పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతూ లబోదిబో మంటున్నారు. ఇలాంటి పరిస్థితు ల్లో ఈ ఏడాది పత్తి పంటనే సా గు చేసేందుకు జిల్లా రైతులు అ ధికంగా ఆసక్తి చూపుతున్నారు. అయితే అధికారులు భావిస్తున్నట్లుగా మిశ్రమ పంటల సాగు విస్తీర్ణం తగ్గి సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తుంది.అంచనాలకు మించిన ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ధరల ఎచ్చుతగ్గుల కారణంగా పత్తి పంటకు ధరలు ఉ ండవని ప్రచారం జరిగినప్పటికీ గతేడు పత్తి పం టల ధరలు అంచనాలకు మించి క్వింటాలుకు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు పలికింది. పంట చేతికి వచ్చినప్పటి నుంచి కొను గోలు ముగిసే వరకు మద్దతు ధరను మించిన ధరలేదక్కాయి. తెల్ల బంగారం సిరులు కురిపించడంతో ఈ సారి కూడా రైతులు పత్తి పంటపై భారీ ఆశలు పెట్టుకుంటున్నారు. కాని సోయా పంట ధర మాత్రం రూ.2వేల నుంచి రూ.2700 దాటలేదు. అలాగే భారీ వర్షా లకు పంట తడిసి పోవడంతో నాణ్యత లేదన్న సాకుతో వ్యాపారులు కొనుగోలు చేసేందుకు నానా ఇబ్బందుల పాలు చేశారు. దీంతో పత్తి పంటను సాగు చేసి ఉ ంటే నష్టాల నుంచి గట్టెక్కెవారిమన్న భావన తో కొంత మంది రైతులు ఈ సారి సోయా పంటను తగ్గించి పత్తి పంటనే వేసేందుకు ముందుకు వస్తున్నారు. గత అనుభవంతోనే ఈసారి పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 20వేల ఎకరాలకు పై గా పత్తి పంట సాగు విస్తీర్ణం పెరిగిందని అధికారులే చెబుతున్నా రు. ఇప్పటికే రైతులు విత్తనాలను కొనుగోలు చేసి తొలకరి వర్షం కో సం ఎదురు చూస్తున్నారు.వెంటా డుతున్న గులాబీ గుబులు..జిల్లాలో పత్తి పంటను సాగు చేస్తున్న రైతుల్లో గులాబీ రంగు పు రుగు గుబులు పుట్టిస్తుంది. కొన్నేళ్లుగా గులాబీ రంగు పురుగు పత్తి పంటను వెంటాడుతునే ఉంది. ఈ పురుగు ఉ ధృతితో పంటను నష్ట పోవాల్సి వస్తుంది. అయినా రైతులు పత్తి పంట సాగుకే అధికంగా మొగ్గు చూపుతున్నారు. వర్షాధార పంటగా సాగయ్యే పత్తికి జిల్లా వా తావరణం అనుకూలంగా ఉండడంతో పాటు నల్లరేగడి భూముల్లో అ ధిక దిగుబడులు రావడమే అసలు కారణమని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం మిశ్రమ పంటలను సాగు చేస్తేనే మంచి ఫలితా లు వస్తాయని సూచిస్తున్నారు. రైతులు స్వయంగా పత్తి పంటను సా గు చేసిన అనుభవంతోనే ముందుకు సాగుతున్నారు. తొలకరి వర్షాలకే పత్తి పంటను విత్తుతే చీడ పీడల నుంచి తట్టుకుని అధిక దిగుబడు లు వస్తాయని పేర్కొంటున్నారు. వాణిజ్య పంటగా పిలిచే పత్తి పంట తో అప్పులు తీరే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏడాది నష్టం వచ్చిన మరో ఏడాది ఆదుకోకపోతుందా అనే భావ నతో పత్తి పంటను సాగు చేసేందుకు రైతులు ఎక్కువగా ఆసక్తి చూ పుతున్నారు. అయితే ధరలు భాగానే ఉ న్న పెట్టుబడి ఖర్చులు మరింతగా పెరిగి పోవడంతో లాభాలు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

## వార్షిక రుణ ప్రణాళిక సిద్ధం

ఆసిఫాబాద్ : వర్షాకాలం పంటల సీజన్ మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. ప్రభుత్వం కూడా ముందస్తు ఏరువాకకు సిద్ధమంటూ చెప్పుకొస్తోంది. ఈ నేపథ్యంలో పంట విత్తుకు అవసరమైన డబ్బుల కోసం రైతులు ఎదురు చూస్తున్న తరుణంలో వాణిజ్య, సహకార బ్యాంకులు రుణ ప్రణాళికను ఖరారు చేశాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఇందన ధరలు పెరుగడంతో ఆ ప్రభావం వ్యవసాయ రంగంపైన పడింది. పెరిగిన ధరలకు తగ్గట్టుగానే రైతాంగానికి జారీ చేస్తున్న పంట రుణాల పరిమితిని కూడా పెంచాలన్న డిమాండ్ గత రెండేళు ్లగా వినిపి స్తోంది. ఈ నేపథ్యంలో వాణిజ్య బ్యాంకులు తర్జన, భర్జన తర్వాత వాణిజ్య పంటలు, ఆహార పంటలకు కూడా దశల వారీగా రుణ పరిమితిని ఐదు నుంచి పది శాతం పెంచాలని నిర్ణయించాయి. ఈ మేరకు లీడ్ బ్యాంక్ అన్ని బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసింది. నేడో, రేపో వార్షిక రుణ ప్రణాళిక కూడా విడుదల చేసే అవకాశాలు ఉన్నా యని చెబుతున్నారు. అయితే పంట రుణాలకు సంబంధించి గతంలో తీసుకున్న రుణం చెల్లించిన వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని బ్యాంకులు నిర్ణయించా యి. రెన్యూవల్ రుణాల జారీకి అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించినట్టు లీడ్ బ్యాంకు మేనేజర్ హన్మంతరావు ఇప్పటికే ప్రారంభించారు. అన్ని అనుకున్నట్లు జరిగితే జూన్ 7వ తేదీ నుంచి రుణ మంజూరు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికకకు



అనుగుణంగా వివిధ బ్యాంకులకు ఇచ్చే లక్ష్యాలను ఈ దఫా వంద శాతం పూర్తి చేయాలని నిర్ణయించినట్టు లీడ్ బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. - జిల్లా వ్యాప్తంగా..కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 4,51,778 ఎకరాల సాగు విస్తీ ర్ణానికి గాను 3.50లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయనున్నారు. ఇవి కాకుండా వరి 33,500 ఎకరాలు, కంది 44,722 ఎకరాలు, సోయా 526 ఎకరాలు, వేరుశనగా 57 ఎకరాలు, పొద్దుతిరుగుడు 170 ఎకరాలు, ఆముదం, తదితరు పంటలు 2వేల ఎకరాల్లో పంటలు వేస్తున్నట్టు అంచాన వేశారు. ఇందులో గతేడాది పంటల వారీగా చేసి న రుణ పరిమితి వివరాలు ఈ సారి ఇవ్వనున్న రుణాలిలా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,19,165 మంది రైతులు ఉండగా వీరికి వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు జారీకానున్నాయి. ఇందులో గత ఏడాది పత్తి ఎకరాకు రూ.38వేలు రుణం ఇవ్వగా ఈ సారి రూ.40వేలకు పెంచను న్నారు. అలాగే వరికి గతేడాది ఎకరాకు రూ.36వేలు రుణం మంజూరు చేయగా ఈ సారి రూ.40వేలకు పెంచనున్నారు. విత్తన వరికి గతేడాదికి రూ.42వేలు రుణం జారీ చేయగా, ఈ సారి 3వేలు పెంచి రూ.45వేలు ఇవ్వనున్నారు. మొక్కజొన్నకు గతేడాది రూ.28వేలు రుణం జారీ చేయగా, ఈసారి ఎకరాకు రూ.32వేలు ఇవ్వనున్నారు. కంది పంటకు గతేడాది రూ.18 వేలు రుణం జారీ చేయగా, ఈ ఏడాది రూ.21వేలు రుణం ఇచ్చేందుకు వెసులుబాటు ఇచ్చారు. అలాగే పొద్దుతిరుగుడు పంటకు సంబంధించి గతంలో రూ.22వేలు రుణం ఇవ్వగా, ఈ సారి రూ.24వేలు పెంచారు. ఆముదం పంటకు గతంలో రూ.18వేలు ఉంటే, ఈ సారి రూ.21వేలు రుణం ఇవ్వనున్నారు. జవారుజొన్నకు రూ. 16 నుంచి రూ. 18వేలు, శనగకు రూ. 22వేల నుంచి రూ. 24వేలకు పెంచనున్నారు.వేరుశనగకు గతేడాది రూ. 26 వేలు ఇవ్వగా, ఈ యేడాది రూ.28వేలు, శనగకు గతేడాది రూ.15 వేలు ఇవ్వగా ఈ సారి రూ.17వేలు రుణం మంజూరు చేయనున్నారు.వార్షిక రుణ ప్రణాళిక ఖరారు..-కోవ హన్మంతరావు, లీడ్ బ్యాంకు మేనేజర్, ఆసిఫాబాద్ఆసిఫాబాద్ జిల్లాకు సంబం?ధించి వార్షిక రుణ ప్రణాళికను ఖరారు చేశాం. ఈ నెల 7 తర్వాత ప్రణాళికను విడుదల చేయాలనుకుంటు న్నాం. పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ సంఘాల రుణాలు, ఇత ర సాధారణ రుణాలకు సంబంధించి కార్యాచరణ ఉంటుంది. గతే డాది బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాల్లో 75 శాతం మేర పూర్తి చేశాం. రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పోల్చి చూస్తే ఇది మంచి పురోగతి. వెను కబడిన ప్రాంత రైతాంగానికి ప్రయివేటు రుణ బాధల నుంచి విముక్తి కల్పించే లక్ష్యంతో ఈ సారి మరింత పకడ్బందీగా పంట రుణాలు అందేలా చర్యలు చేపడుతాం.

## కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జికి లైన్ క్లియర్

పెద్దపల్లి)పెద్దపల్లి పట్టణంలోని కూనారం రైల్వే క్రాసింగ్ వద్ద ఓవర్ బ్రిడ్జి పనులకు లైన్ క్లియర్ అయ్యింది. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నాలుగు మాసాల క్రితం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 119 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేయగా, పనులు చేపట్టేందుకు త్వరలోనే టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. జూన్ నెలాఖరులోగా టెండర్లు, ఒప్పందాలు పూర్తయి జూలైలో పనులు చేపట్టే అవకాశాలున్నాయి. పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్, తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు పెద్దపల్లి పట్టణంలోని కూనారం రైల్వే క్రాసింగ్ వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికై ఎట్టకేలకూ నిధులు మంజూరయ్యాయి. దీంతో దశాబ్దాల కల నెరవేరనున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించనున్న ఈ బ్రిడ్జి నిర్మాణానికి 119 కోట్ల 50 లక్షలు మంజూరు చేస్తూ జనవరి 21న రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాటు రాష్ట్రంలో మరో నాలుగు చోట్ల ఆర్‌వోబీలను మంజూరు చేశారు. తప్పనున్న ఇబ్బందులు.. సికింద్రాబాద్ నుంచి న్యూఢిల్లీ వరకు గల అతిపెద్ద రైల్వేలైన్ పెద్దపల్లి గుండా పోతున్నది. ఈలైన్‌లో అనేక ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్, ప్యాసింజర్ రైళ్లతో పాటు గూడ్స్ బండ్లు నడుస్తుంటాయి. దీంతో చీటికి, మాటికి గేట్లు పడుతుండడంతో పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్‌కు వెళ్లే రహదారిలో, పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్లే రహదారిలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 25 ఏళ్ల క్రితం పెద్దపల్లి నుంచి మంథనికి వెళ్లేందుకు ఓవర్ బ్రిడ్జిని నిర్మించడంతో ఆ దారి గుండా ప్రయాణించే వాహనదారుల కష్టాలు తీరాయి. పెద్దపల్లి పట్టణం నుంచి కాల్వశ్రీరాంపూర్ వెళ్లే రహదారిలో కూనారం క్రాస్ రోడ్డులో రైలు గేట్ పడుతుండడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలనే ప్రతిపాదన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఆ కల నెరవేరడం లేదు. గతంలో ఒకసారి కేంద్ర రైల్వే శాఖ ద్వారా నిధులు మంజూరైనప్పటికీ, అది కాగితాలకే పరిమితం అయ్యింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఓవర్ బ్రిడ్జిని చేపట్టాలని నిర్ణయించి 119 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 250 కోట్ల 2 లక్షలు, కేంద్ర ప్రభుత్వ వాటా కింద 154 కోట్ల 80 లక్షల రూపాయలు భరించాల్సి ఉ ంటుంది. ఈ వంతెన నిర్మాణం కోసం పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేష్, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఎంపీ పలుసార్లు రైల్వే జీఎంలకు విన్నవించడంతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లారు. ఎట్టకేలకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరుచేయడంతో ఆయన శుక్రవారం కూనారం క్రాస్ రోడ్డులో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ వంతెన నిర్మాణానికి త్వరలోనే ఆర్‌అండ్‌బీ టెండర్లను ఆహ్వానించనున్నది. ఇక్కడ భూసేకరణ తక్కువగానే ఉంటుంది. ఇప్పటికే రాజీవ్ రహదారి నుంచి రైల్వేగేట్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. నాలుగు నెలల తర్వాత టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. జూలైలో పనులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# కాంట్రాక్టర్ల.. జేబులు ఖాళీ!

నిర్మల్ : ప్రభుత్వ శాఖలో పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్లు తమకు రావాల్సిన సొంత డబ్బులు చెల్లించే విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో తీ వ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఏదైనా ప్రభుత్వ కాంట్రాక్టు పనులు చేయడానికి ముందు సంబంధిత ప నుల కు సంబంధించి కాంట్రాక్టర్లు ఆ పనుల్లో 10 శాతం ఈఎండీ (ఎర్నెడ్ మనీ డిపాజిట్) చెల్లించడం ఒక నిబంధన. అలాగే ప్రభుత్వ పనులు చేయడానికి ముందు సంబంధిత కాంట్రా క్టర్ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి ఫిక్సిడ్ సెక్యూ రి టీ డిపాజిట్ (ఎఫ్ఎస్‌డీ) కూడా చెల్లించవలసి ఉంటుంది. కాంట్రాక్టర్ ఒకవేళ పనులు పూర్తి చేయకపోయినా, మధ్యలో నిలిపినా ఈ రెండు డిపాజిట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా ప్ర భుత్వం ఖాతాకు సంబంధిత ప్రభుత్వశాఖలు జమ చేస్తాయి. తిరిగి ఇచ్చేందుకు ప్రభుత్వ శాఖలు నో..ప్రభుత్వ కాంట్రాక్టు పనులు పొందడానికి ముందు కాంట్రాక్టర్ చెల్లిస్తున్న ఈఎండీ ఎఫ్ఎస్‌డీఈ నిధులను తిరిగి వారికి ఇచ్చేందుకు అధికారులు విముఖత చూపుతున్నారు. కాంట్రాక్టు పనులు పూర్తి చేసిన నెల వ్యవధిలో చేసిన పనుల ను సంతృప్తి చెందిన తర్వాత అధికారులు కాంట్రాక్టర్‌లకు వర్క్ సాటిస్ఫాక్షన్ సర్టిఫికెట్ ఇచ్చిన వెంటనే వారు చేసిన డిపాజిట్ డబ్బులను చెల్లించాలి. కానీ పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖలో ఈ తరహా చెల్లింపుల విషయంలో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుమారు మూడు, నాలుగేళ్లుగా డిపాజిట్లను అధికారులు కాంట్రాక్టర్లకు ఇవ్వకుండా సతారు స్తున్నారన్న చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పులు తెచ్చి పనులు చేసి, సర్టిఫికెట్ సమర్పించినప్పటికీ డిపాజిట్ డబ్బులు చెల్లించకపోవడం అన్యాయమని కాంట్రా క్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పనులు చేస్తే కాం ట్రాక్టు పనుల్లో 10 నుంచి 20 శాతం మేరకు అర్థికంగా లా భం పడవచ్చని కాంట్రాక్టర్లు ఆశపడి పనులు చేస్తున్నారు. అ ధికారులు తమ డిపాజిట్లు తిరిగి ఇచ్చే విషయంలో తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు వినిపించినప్పటికీ మార్పు లేదని ఆవేదన చెందుతున్నారు. రూ.వంద కోట్లకు పైగానే కాంట్రాక్టర్ల బాకీ..ప్రభుత్వ శాఖల పనులు నిర్వహించిన కాంట్రాక్టర్లకు కాంట్రాక్టర్ల సొంత డిపాజిట్ డబ్బులు సుమారు రూ.వంద కోట్లకు పైగానే ప్రభుత్వ శాఖలు బాకీ ఉన్నట్లు సమాచారం. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖలో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన డబ్బులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖలో మొత్తం రూ.35 కోట్ల బకాయిలు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. అలాగే పంచాయతీరాజ్ శాఖలో రూ.57 కోట్ల మేర కాంట్రా క్టర్లకు డిపాజిట్ డబ్బులు చెల్లించాలి. ఇందులో ప్రధాన గ్రామ పంచాయతీల ప రిధిలో పని చేసిన సీసీ రోడ్లకు సంబంధించిన చెల్లింపులు ఎక్కువగా ఉన్నట్లు తె లుస్తోంది. ఈ చెల్లింపులు సుమారు రూ.47 కోట్ల దాకా ఉన్నట్లు చెబుతున్నారు. డిపాజిట్ డబ్బులు పక్కన పెడితే చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇంతవరకు రాలేదని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ల పేరిట గ్రామ పంచాయ తీల్లో సర్పంచ్‌లు పెద్ద మొత్తంలో పనులు చేశారు. ఉపాధి హామీ పథకంలో చేసిన పను లకు సంబంధించిన బిల్లుల చెల్లింపు జరగలేదు. దీంతో పెండింగ్ బిల్లులతో పాటు డిపాజిట్ డబ్బులు కూడా రాకపోవడంతో కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో విప్పటికే సర్పంచ్‌లు పలుసార్లు ఆందోళనలు సైతం చేశారు. మంత్రి సమావేశాన్ని కూడా ఇటీవల నిర్మల్ అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశం సందర్భంగా బాయ్‌కట్ చేసి సర్పంచ్‌లు తమ నిరసన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా బిల్లులు రాకపోగా తమ డిపాజిట్ డబ్బులు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాలో డబ్బులు లేకనే...రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖతో పాటు ఇతర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సం బంధించి సరుదు గుత్తేదారులకు బిల్లుల చెల్లింపుల్లో జా ప్యం చేయడంతో పాటు, కాంట్రాక్టర్లకు తమ డిపాజిట్ డ బ్బులు చెల్లించే విషయంలో పంచాయతీరాజ్ రోడ్లు భవనా ల శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు వెనుకంజ వేయ డానికి కారణాలు విశ్లేషిస్తే ఇందులో అధికారుల తప్పిదం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ ఖజానాలో నిధులు లేని కార ణంగానే వారికి డిపాజిట్లు తిరిగి ఇచ్చే విషయంలో తాత్సా రం జరుగుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి. పను లు పూర్తి చేసిన తర్వాత కాంట్రాక్టర్లకు నెల రోజుల వ్యవ? దిలో డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లించడం నిబంధన ఉన్న ప్పటికీ ఖజానాలో డబ్బులు ఎలా చెల్లించగలుగుతామని అ ధికారులు పేర్కొంటున్నారు. ఈ విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లకు నడమ గొడవలు కూడా జరుగుతున్నాయని చెబుతున్నారు. దీంతో ప్రభుత్వ పనులు చేసేందుకు కాం ట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ప్రభుత్వ శాఖల అధికారులు చెబుతున్నారు. సిబ్బందిని తొలగిస్తున్న కాంట్రాక్టర్లు..ప్రభుత్వ బిల్లులతో పాటు డిపాజిట్ డబ్బులు చెల్లించని కారణంగా ప్రముఖ కాంట్రాక్టర్ త మ సిబ్బందిని తక్కువ చేసుకుంటున్నారు. నెలనెలా అప్పులు పెరిగిపోతుండడం డి పాజిట్ డబ్బులు కూడా రాని పరిస్థి తుల్లో సిబ్బందిని, కూలీలను తొలగిస్తున్నా రన్న అభి ప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమ సమస్యలను ప్రభుత్వంతో పాటు అధికారులు పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. మంత్రితో సహా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నా పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే..- శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పంచాయతీ రాజ్ శాఖ, నిర్మల్‌తమ శాఖ ద్వారా చేపట్టిన ప నులకు సంబంధించి బిల్లులు రా వాల్సి ఉంది. ముఖ్యంగా ఇటీవల ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు సంబంధించిన రూ.47 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి మరో రూ.10 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నిధుల విడుదల కాగానే బిల్లులు చెల్లింపు ప్రక్రియ చేపట్టనున్నట్లు ఆయన వివరించారు.

# రూ.16 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్

మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలో రూ.16 కోట్లతో కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్‌ను ఏర్పాటుచేయనున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రేనివబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో మహబూబ్‌న గర్ మునిసిపాలిటీలో ఒప్పందం చేసుకుందన్నారు. హైదరాబాద్ తరువాత రాష్ట్రంలోనే మొదటిసారి ఈ బయోప్లాంట్ పాలమూరులో ఏర్పాటవుతుంద న్నారు. దీన్ని రెండుఎకరాల స్థలంలో ఏర్పాటు చేయనున్నామన్నారు. తడిచెత్త నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను నెలకొల్పను న్నామన్నా రు. ఒకటన్ను తడి చెత్తకు రూ.150 మునిసిపాలిటీకి చెల్లిస్తారని, ప్రతీరోజు 40-50 టన్నుల తడిచెత్త సేకరిస్తే సంవత్సరానికి మునిసిపాలిటీకి రూ.22 లక్షల ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. ఇదివరకు ఎక్కడ పడితే అక్కడ చెత్తను పడేసేవారని, చెత్తను తొలగించడానికి మునిసిపా లిటీకే ఖర్చు అయ్యే దని, ఇప్పుడు మునిసిపాలిటీకే ఆదాయం వస్తుందన్నారు. దీనివల్ల మునిసిపా లిటీ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండటంతోపాటు



కాలుష్యం లేకుండా ఉం టుందని వివరించారు. ఈ యూనిట్‌కు అవసరమై న రెండెకరాల స్థలాన్ని తక్షణమే గుర్తించి ఇవ్వాలని మునిసిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ తేజస్‌నందలాల్‌పవర్, మునిసిపల్ చైర్మన్ కోరమోని నర్సింహులు, టీఎస్ రెడ్‌కో చైర్మన్ జెఎస్ఎన్ మూర్తి, మునిసిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు

## హమాలీ చార్జీలకు మంగళం?

సిరిసిల్ల ఆరుగాలం శ్రమించి పంటను పండించిన అన్న దాతలు ధాన్యం విక్రయించే వరకు కష్టాలు పడు తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు ఇబ్బందులకు గురి చేస్తున్నా భూ తల్లినే నమ్ముకున్న రైతులు సేద్యం మాత్రం వీడడం లేదు. జిల్లాలో ఎట్టకేలకు యాసంగి ధాన్యం కొనుగోళ్లు చేపట్టినా నత్తనడకనే సాగుతున్నాయి. మరోవైపు హమాలీ చార్జీలు రైతులకు భారంగా మారుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన హమాలీ చార్జీలు నాలుగేళు ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు రూ.8.33 కోట్లు బకాయిలు రావాల్సి ఉ ంది. కేంద్ర ప్రభుత్వం హమాలీ చార్జీలు బకాయిలు విడుదల చేస్తుందా? పూర్తిగా మంగళం పాడుతుందా? అనే సందిగ్ధం నెలకొంది. కొందరు మాత్రం హమాలీ చార్జీలు రాకపోవచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. రైతులపై అదనపు భారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కరువు పరిస్థితుల నుంచి రైతులు కోలుకున్నారు. కాళేశ్వరం, ఎల్లంపల్లి జలాలకు తోడుగా వర్షాలు సమృద్ధిగా కురువడంతో బోరు బావులు, వ్యవసాయ బావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. దీనికి తోడుగా ప్రభుత్వం 24 గంటల కరెంట్ ఇవ్వడంతో జిల్లాలో వరి సేద్యం పెరిగింది. గడిచిన నాలుగేళ్లలోనే ధాన్యం దిగుబడి కూడా పెరుగుతూ వస్తోంది. పంట మార్పిడి చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా రైతులు వరిని మాత్రం వీడడం లేదు. 2018-19 వానాకాలంలో 14,73,312 మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగిలో 10,07,217 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. 2019 -2020 సంవత్సరంలో వానాకాలం 18,09,957 మెట్రిక్ టన్నులు, యాసంగిలో 24,53,716 మెట్రిక్ టన్నులు, 2020-21 సంవత్సరం వానాకాలంలో 17,65,529 మెట్రిక్ టన్నులు, యాసంగి 36,13,832 మెట్రిక్ టన్నులు, 2021-22 వానాకాలం 27,61,205 మెట్రిక్‌ట టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కొనుగోలు కేంద్రంలో తూకం, ధాన్యం ఎగుమతికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం రైతులకు హమాలీ కింద రూ.5.60 వరకు చెల్లించేది. 2018-19 నుంచి కేంద్ర ప్రభుత్వం హమాలీ చార్జీలు ఇవ్వడం లేదు. రైతుల నుంచి హమాలీ కూలి చెల్లిస్తూ వస్తున్నారు. ప్రభుత్వం నుంచి రాగానే రైతులకు అందజేస్తామని పేర్కొంటున్నారు. దాదాపు జిల్లాలో రూ.8.33 కోట్ల వరకు రైతులకు రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నామమాత్రపు హమాలీ చార్జీలు రాకపోగా జిల్లాలో రైతులు క్వింటాల్‌కు రూ.35 నుంచి రూ.50 వరకు సొంతంగా చెల్లిస్తున్నారు. జిల్లాలో గడిచిన నాలుగేళ్లలో రైతులు రూ.44 కోట్ల వరకు హమాలీ భారాన్ని భరించారు. హమాలీ చార్జీలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించపోవడంతో రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని యాసంగి కొనుగోళ్లు రాజన్న సిరిసిల్ల జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ఇప్పటివరకు సగం వరకే పూర్తయ్యాయి. జిల్లాలో యాసంగిలో 1.44 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా వరి 1.30లక్షల ఎకరాల్లో వేశారు. 2.97 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందుకోసం 268 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడానికి సిద్ధమైనా 253 ప్రారంభించారు. వీటి పరిధిలో ఇప్పటి వరకు 1.68 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 12 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ పూర్తి కావడంతో మూసి వేశారు. ఇప్పటి వరకు 54 ఐకేపీ కేంద్రాల్లో 34,853 మెట్రిక్ టన్నులు, 188 సింగిల్ విండో కేంద్రాల్లో 1,23,671 మెట్రిక్ టన్నులు, 10 డీసీఎంఎస్ కేంద్రాల్లో 5,875 మెట్రిక్ టన్నులు, నాలుగు మెప్మా కేంద్రాల్లో 2,543 మెట్రిక్‌టన్నులు, మూడు మార్కెట్ యార్డుల్లో 2,049 మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ?ధాన్యం రవాణాపై రైతుల ఆందోళనలు జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. తూకంవేసినా రవాణాకు లారీలు రాకపోవడంతో ఆందోళనలకు దిగుతున్నా రు. కేంద్రాల్లో రైతుల మధ్య కూడా ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఎల్లారెడ్డిపే ట, ముస్తాబాద్, వీర్నపల్లి, చందుర్తి సిరిసిల్ల, గంభీరావుపేట, తంగళ్లపల్లి, రుద్రంగి, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో రైతులు తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.

## క్రమబద్ధీకరణలో కదలిక

సిరిసిల్ల : ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తుల నిర్మాణాల క్రమబద్ధీ కరణలో కదలిక వచ్చింది. జిల్లాలో జీవో 58, 59 కింద 275 దరఖా స్తులు వచ్చాయి. వాటిలో జీవో 58 కింద తొలుత 136 దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను మొదలు పెట్టారు. ఇందుకోసం రెండు బృందాలను ఏర్పాటు చేశారు. పరిశీలన అనంతరం 125 గజాల్లో నివాసం ఉంటే ప్రభుత్వం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తుంది. జీవో 59లో ప్రభుత్వ స్థలాల విస్తీర్ణం, రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా 50 నుంచి వంద శాతం వరకు ఛార్జీలు వసూలు చేసి క్రమబద్ధీకరిస్తుంది. ప్రస్తుతం జీవో 58 ప్రకారం ఉన్న ఇళ్లకు హక్కులు లభించనున్నాయి. పరిశీలనకు ప్రత్యేక యాప్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్రమబద్ధీకరణకు వచ్చిన 275 దరఖాస్తుల్లో జీవో 58 కింద ఉన్న 136 దరఖాస్తులను పరిశీలించడానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. డీఆర్వో టి.శ్రీనివాసరావు, ల్యాండ్ సర్వే ఏడీ ఈ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గురు సభ్యులతో బృందాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నాయి. ఇందుకోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. సీసీఎల్ఏ కార్యాలయం నుంచి అందుబాటులోకి వచ్చిన యాప్‌లో ఏ జీవో కింద ఎన్ని దరఖాస్తులు వచ్చాయో? అనే విషయాలను ?ధ్రువీకరించు కొని వాటిని పరిశీలించారు. జీవో 58 కింద చేసుకన్న దరఖాస్తుల పరిశీలనకు సంబంధించిన భూముల క్రమబద్ధీకరణకు కరెంట్, నల్లాబిల్లులతో ఏదైనా ఒకదానిని రుజువుగా చూపాలి. ఆదాయ పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగులా?, లేక ఇతర ఉద్యోగులా? అనేది పరిశీలిస్తారు. భూమి ఏ కేటగిరి కింద ఉందనేది పరిశీలిస్తారు. భూమి ఖాళీగా ఉందా? నిర్మాణంలో ఉందా? అని నిర్ధారిస్తారు. భూమి ఎప్పటి నుంచి కబ్జాలో ఉ ంది? అందుకు సంబంధించిన ఆధారాలు, కోర్టు కేసులను పరిశీలిస్తారు. 2014 జూన్ 2 నాటికి ముందు కబ్జాలో ఉన్నట్లు రుజువులు ఉంటేనే క్రమబద్ధీకరిస్తారు. మండలాల వారీగా దరఖాస్తులు రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13 మండలాల్లో క్రమబద్ధీకరణకు జీవో 58, 59 కింద వచ్చిన దరఖాస్తుల్లో సిరిసిల్లలో 41, తంగళ్లపల్లి 96, గంభీరావుపేట 3, వేములవాడ 75, వేములవాడ రూరల్ 2, చందుర్తి 6, రుద్రంగి 2, బోయినపల్లి 2, ఎల్లారెడ్డిపే ట 2, వీర్నపల్లి 2, ముస్తాబాద్ 4, ఇల్లంతకుంట 9, కోనరావుపేటలో 31 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 58 జీవో కింద పరిశీలిస్తున్న దరఖాస్తుల్లో సిరిసిల్ల రెవెన్యూ డివిజనల్ పరిధిలో గంభీరావుపేట మండలంలో 1, ఇల్లంతకుంట 3, సిరిసిల్ల 6, ముస్తాబాద్ 1, తంగళ్లపల్లిలో 58, వీర్నపల్లిలో 2 ఉన్నాయి. వేములవాడ డివిజన్‌లో రుద్రంగిలో ఒకరు, కోనరావుపేటలో 26 మంది, వేములవాడలో 38 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎల్ఆర్ఎస్‌కు మోక్షమెప్పుడో? అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం ఎల్ఆర్ఎస్‌లో చేసుకున్న దరఖాస్తుల పరిష్కారానికి మోక్షం లభించడం లేదు. దరఖాస్తు చేసుకొని రెండేళ్లవుతోంది. జిల్లాలో ఆగస్టు 26, 2020 తేదీ వరకు రిజిస్ట్రేషన్ అయిన అనధికారిక ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం అక్టోబరు వరకు దరఖాస్తులు స్వీకరించారు. ప్లాటుకు మార్కెట్ విలువలో 33 శాతం జరిమానాతో క్రమబద్ధీకరించాలని ఆదేశాలు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామపంచాయతీలు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాల్టీల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం జీవో నంబరు 58 ప్రభుత్వ భూముల్లో కబ్జాకు గురైన వాటిని క్రమబద్ధీకరిస్తున్న క్రమంలో అక్రమ లే అవుట్‌లు, ప్లాట్లకు సంబంధించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు కూడా పరిష్కరించాలని కోరుతున్నారు. ఎల్ఆర్ఎస్‌లో జిల్లాలో 43,149 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని గ్రామపంచాయతీల పరిధిలో 16,355 దరఖాస్తులు వచ్చాయి. సిరిసిల్ల మున్సిపాలిటీలో 10,524 దరఖాస్తులు, వేములవాడ మున్సిపాలిటీలో 16,270 దరఖాస్తులు వచ్చాయి. వీటితోపాటు గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల్లో బోయినపల్లి మండలకేంద్రంలో 20 రాగా గ్రామపంచాయతీల్లో 645, చందుర్తిలో 15 రాగా గ్రామపంచాయతీల్లో 230, ఇల్లంతకుంటలో 24 రాగా గ్రామపంచాయతీల్లో 1054, గంభీరావుపేటలో 17 రాగా గ్రామపంచాయతీల్లో 861, కోనరావుపేటలో 15 రాగా గ్రామపంచాయతీల్లో 277, వేములవాడ అర్బన్ మండలంలో తొమ్మిది రాగా గ్రామపంచాయతీల్లో 3,909, ఎల్లారెడ్డిపేటలో 16 రాగా గ్రామపంచాయతీల్లో 3,949, తంగళ్లపల్లిలో 26 రాగా గ్రామపంచాయతీల్లో 3,784, వేములవాడ రూరల్ మండలంలో 15 రాగా గ్రామపంచాయతీల్లో 214, రుద్రంగిలో రెండు రాగా గ్రామపంచాయతీల్లో 304, వీర్నపల్లిలో మూడు రాగా గ్రామపంచాయతీల్లో 71 దరఖాస్తులు వచ్చాయి. ఎల్ఆర్ఎస్ సంబంధించిన అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో ఎప్పుడు పరిష్కారం లభిస్తుందోనని ఎదురు చూడక తప్పడం లేదు.

# మహిళా ఠాణాపై.. మౌనమేలా..?

సూర్యాపేట : సూర్యాపేట పట్టణం విజయకాలనీకి చెందిన వివాహితపై గత మార్చిలో ఆమె భర్త మద్యం మత్తులో భౌతికదాడికి పాల్పడ్డాడు. అదనపు కట్నం తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితురాలు సూర్యాపేటలోని పోలీసు స్టేషన్‌కు వచ్చారు. అదే రోజు పట్టణంలో మంత్రి పర్యటన ఉండటంతో పోలీసు అధికారి అందుబాటులో లేరు. ఇదే విషయాన్ని సిబ్బంది ద్వారా తెలుసుకున్న మహిళ మరుసటి రోజు మరోసారి ఠాణాకు వెళ్లారు. ఆ రోజూ అధికారి మంత్రి పర్యటనలోనే ఉన్నారు. దీంతో ఆమె ఆర్టీసీ బస్సులో నల్గొండలోని మహిళా ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రత్యేక మహిళా ఠాణా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల అతివలపై దాడులు, అత్యాచారం, వేధింపులు, ఇతర ఘటనలు రోజురోజుకూ గణనీయంగా పెరిగిపోతున్నాయి. మగువలు ఎవరైనా ఫిర్యాదు చేయాలంటే ఉమ్మడి నల్గొండ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. మరోవైపు సూర్యాపేట జిల్లా కేంద్రంగా ఏర్పడిన నాటి నుంచి పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా ఠాణాలోనూ సిబ్బంది సంఖ్య పెంచలేదు. శాంతి భద్రతల పరిరక్షణ, రాత్రి వేళ గస్తీ, పాత కేసుల విచారణ, వీవీఐపీల బందోబస్తు తదితర విధుల్లో నిత్యం బిజీగా గడిపే పోలీసు అధికారులకు మహిళా సంబంధిత కేసుల వ్యవహారం తలకుమించిన భారంగా మారింది. అతివలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారికోసం ప్రత్యేక ఠాణా ఏర్పాటుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరం ఉంది.



ఒకే ప్రాంగణంలో నాలుగు పోలీస్‌స్టేషన్లు

సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్ ప్రాంగణంలోనే వన్‌టౌన్, టూటౌన్‌తోపాటు ట్రాఫిక్, సీసీఎస్ విభాగాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అంటే ఒకే ప్రాంగణంలో నాలుగు ఠాణాల సిబ్బంది పని చేస్తున్నారు. పదేళ్ల క్రితంతో పోల్చితే సూర్యాపేట జిల్లా కేంద్రం ప్రస్తుతం ఎంతో విస్తరించింది. శివారు ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. అదే స్థాయిలో నేరాలూ పెరిగిపోతున్నాయి. దీంతోపాటు కొత్తబస్టాండు, ఖమ్మం క్రాస్‌రోడ్డు ప్రాంతాలు వేగంగా విస్తరించాయి. ఏదైనా ఫిర్యాదు చేయాలంటే అక్కడి ప్రాంత ప్రజలు సైతం దూరంగా ఉన్న పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. రెండో ఠాణాను కొత్తబస్టాండు ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.ఫిర్యాదులు స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లురాజేంద్రప్రసాద్, ఎస్పీ, సూర్యాపేట

సూర్యాపేట జిల్లాకు ప్రస్తుతం ప్రత్యేకంగా అతివల కోసం ప్రత్యేక ఠాణా ఏర్పాటుకు అవకాశం లేదు. ఇప్పుడున్న ఠాణాలోనే మహిళా సిబ్బంది సంఖ్యను భారీగా పెంచే యోచనలో ప్రభుత్వం ఉంది. త్వరలో జరగబోయే పోలీసు నియామకంలో 33 శాతం సిబ్బందిని నియమించేలా కృషి చేస్తాం. అప్పటి వరకు మగువల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం.

# సమకూరని ఆదాయం.. దుపాయాలు గగనం!

సంగారెడ్డి : రైతులు పండించిన పంటలను వ్యవసాయ విపణులకు తరలిస్తారు. దీనివల్ల విపణులకు ఆదాయం సమకూరుతుంది. ఆర్థికంగా మెరుగ్గా ఉంటేనే ఇక్కడికి వచ్చే అన్నదాతలకు సరైన సదుపాయాలు కల్పించేందుకు వీలుంటుంది. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడంలేదు. లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం సమకూరకపోవడమే దీనికి కారణం. 2022-23 సంవత్సరానికి నాలుగు చోట్ల మాత్రమే లక్ష్యాన్ని అధిగమించారు.

జిల్లాలో ఎనిమిది

జిల్లాలో జహీరాబాద్, రాయికోడ్, సదాశివపేట, జోగిపేట, పటాన్‌చెరు, వట్‌పల్లి, నారాయణఖేడ్, సంగారెడ్డిలో మార్కెట్‌యార్డులున్నాయి. పంట ఉత్పత్తులను ఎక్కువగా కొనుగోలు కేంద్రాల ద్వారానే సేకరిస్తున్నారు. ధాన్యం, పత్తి పంటలను ప్రభుత్వరంగ సంస్థలు కొనుగోలు చేస్తుండగా వీటి ద్వారా మార్కెట్ కమిటీలకు పరోక్షంగా కొంత ఆదాయం సమకూరుతోంది. మొత్తం కొనుగోలు విలువలో ఒక శాతాన్ని అందిస్తున్నారు.

అధిగమించినవి నాలుగు మాత్రమే

ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం మార్కెట్ కమిటీలకు ఆదాయ



సంగారెడ్డిలోని వ్యవసాయ విపణి

లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. జోగిపేట, పటాన్‌చెరు, నారాయణఖేడ్, సంగారెడ్డి అధిగమించడం విశేషం. ఇందులో పటాన్‌చెరు ముందంజలో ఉంది. లక్ష్యం రూ.4.97 కోట్లు ఉంటే రూ.5.31 కోట్లు వసూలు కావడం విశేషం. ఇక్కడ ఎక్కువగా కూరగాయల విక్రయాలు ఉండటంతో కలిసి వచ్చింది. దీనికి తోడు రిలయన్స్, మోర్ తదితర సూపర్ మార్కెట్ల గోదాములు కూడా ఇక్కడే ఉన్నాయి. జోగిపేట విపణికి రూ.327కోట్ల లక్ష్యం నిర్దేశించగా రూ.4.95 కోట్లు వచ్చింది. సదాశివపేట, జహీరాబాద్, వట్‌పల్లి, రాయికోడ్ లక్ష్యాన్ని చేరుకోలేకపోయాయి. జిల్లాకు రూ.22.05కోట్లు లక్ష్యం కాగా రూ.21.48 కోట్లు సాధించారు.

# అమృత ఫలం.. విష తుల్యం..!



వరంగల్ :వేసవిలో మామిడి పండ్లకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. మార్కెట్, రోడ్లపై ఎక్కడ చూసినా అనేక రకాల జాతుల మామిడి పండ్లు నోరూరిస్తుంటాయి. పండ్ల రారాజుగా పేరొందిన మామిడి విషతుల్యంగా మారుతోంది. గతంలో పండ్లను సహజంగా పండించి మార్కెట్‌కు తరలించేవారు. ఆరోగ్యంగా ఉండేందుకు సీజనల్ పండ్లు తినేందుకు జనం ఆసక్తి చూపిస్తున్నారు. మార్కెట్‌లోకి వచ్చే కాయలను కృత్రిమంగా మాగబెడుతున్నారు. నిషేధిత కాల్షియం కార్బైడ్, ఇతర ప్రమాదకర రసాయనాలను వ్యాపారులు విరివిగా వినియోగిస్తున్నారు. వీటి వినియోగం వలన ప్రజారోగ్యంపై ప్రభావం పడుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఒకే రోజులో పండ్లుగా మార్చేందుకు..

వరంగల్ నుంచి హరియాణ, దిల్లీ, పంజాబ్ తదితర రాష్ట్రాలకు మామిడి ఎగుమతి చేస్తున్నారు. ఈ క్రమంలో 24 గంటల్లోనే మేలిమి పండులా కనిపించేందుకు పరిమితికి మించి కార్బైడ్‌ను వినియోగిస్తుండడంతో.. ఆరోగ్యానికి ముప్పు తప్పడంలేదు. ప్రభుత్వం ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే.. కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్‌లో చౌకగా లభిస్తుండడంతో వీటిని వ్యాపారులు యథేచ్ఛగా వాడుతున్నారు. స్థానిక విక్రయదారులు ఒకే రోజులో కాయలను పండ్లుగా మార్చేందుకు ప్రమాదకర రసాయన ద్రావణాలను కాయలపై చల్లుతున్నారు. వరంగల్ నగర పరిసరాల్లో కార్బైడ్, ఇతర రసాయనాలు హోల్‌సేల్ పండ్ల వ్యాపారుల వద్ద, విత్తన దుకాణాల్లో లభించడం, బ్లాకులో విక్రయించడం చూస్తుంటే ప్రమాదతీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది వరంగల్ ఉమ్మడి జిల్లాలో సుమారు 35,569 మామిడి సాగు చేసినట్లు ఉద్యానవనశాఖ అధికారులు అంచనావేశారు. తామర పురుగు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఈ ఏడాది సుమారు 40 శాతం మేర దిగుబడి తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మహబూబాబాద్‌లో ఎక్కువ స్థాయిలో 15,863 ఎకరాల్లో మామిడిని సాగుచేయగా, సుమారు 31 వేల టన్నుల దిగుబడి వచ్చిందని, వరంగల్‌లో 6 వేల ఎకరాల్లో సాగుచేయగా.. 12 వేల టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. సాధారణంగా ఎకరానికి 4 టన్నుల రావాల్సి ఉండగా.. వివిధ కారణాలతో 2 టన్నులకు తగ్గిందన్నారు. అకాల వర్షాలతో పక్వానికి రాకుండానే చెట్టు నుంచి కాయలు రాలిపోవడంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని చెబుతున్నారు.

తియ్యని పండ్ల వెనుక చేదు నిజం

ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు 2011 ప్రకారం పండ్లను కృత్రిమంగా పండించడం కోసం ఉపయోగించే కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను ప్రభుత్వం నిషేధించింది. సహజంగా పండించడంలో కీలకపాత్ర పోషించే ఇథిలిన్‌ను 100 పీపీఎం వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది. నిబంధనల ప్రకారం సుమారు 20 కిలోల పండ్లను పండించేందుకు 5 గ్రాముల ఇథిలిన్‌ను మాత్రమే వినియోగించాల్సి ఉంటుంది. జిల్లా ఆహార భద్రత, మార్కెట్ అధికారుల పర్యవేక్షణ లోపం, తనిఖీలు లోపభూయిష్టంగా ఉండడంతో.. వ్యాపారులు ఇష్టంవచ్చినట్లు కార్బైడ్, నిషేధిత రసాయనాలను పరిమితికి మించి వాడుతున్నారు.

ఆరోగ్యానికి ముప్పు–డాక్టర్ కె.అశోక్ కుమార్, ఆయుర్వేద ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్

రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లు తింటే అనేక ఆరోగ్య సమస్యల బారినపడే ప్రమాదముంది. దీర్ఘకాలికంగా ఇలాంటి పండ్లు తీసుకోవడం ద్వారా జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే అవకాశముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధకత తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తెలత్తుతాయి. కొన్నిసార్లు విరేచనాలు అవుతాయి. గర్భిణుల్లో హార్మోన్లు దారితప్పుతాయి. సహజమైన పద్ధతిలో పండిన పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

రంగును చూసి గుర్తించొచ్చు..–శంకర్, వరంగల్ జిల్లా ఉద్యానవన శాఖ సాంకేతిక అధికారి

కార్బైడ్, ఇతర రసాయనాలను ఉపయోగించిన మామిడి పండ్లు బయటికి లేత పసుపు, లోపల లేత తెలుపు రంగులో ఉంటాయి. సహజంగా పండిన పండు బయట, లోపల ఒకే వర్ణంలో ఉంటుంది. రంగును చూసి పండ్లను చాలావరకు గుర్తించే అవకాశముంది. రసాయనాలు విడుదల చేసే ఎసిటిలిన్ వాయువుతో పండ్లు బయటి వైపు రంగు మారుతుందే తప్ప అంత రుచిగా ఉండవు. రసాయనాల వినియోగంతో సహజంగా లభించే పోషకాలు నశిస్తాయి.

# కమిషనర్ వస్తేనే కష్టాలు తీరేది!



వరంగల్ : రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరం వరంగల్. 66 డివిజన్లతో ఉన్న మహానగరపాలక సంస్థ పాలనలో కమిషనర్ పాత్ర అత్యంత కీలకం. పారిశుద్ధ్యం, తాగునీరు, పౌరసేవలు, మౌలిక వసతుల కల్పన.. ఇలా ప్రతి విభాగంపై కమిషనర్ పర్యవేక్షణ ఉంటేనే పనులు సాఫీగా సాగుతాయి. గ్రేటర్ వరంగల్ కమిషనర్ బదిలీ అయ్యి నెలన్నర అవుతున్నా కొత్త కమిషనర్ నియామకం జరగలేదు. దీంతో పాలన స్తంభించింది. సమస్యలు, పౌరసేవల జాప్యంపై ఎవరికి ఫిర్యాదులు చేయాలో తెలియక ప్రజలు అవస్థలు పడుతున్నారు.నగరంలోని 66 డివిజన్లలో పారిశుద్ధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయి. ప్రజారోగ్య విభాగంలో ఇద్దరు అధికారులున్నప్పటికీ క్షేత్రస్థాయి పర్యటనలు సాగడం లేదు. ఒక అధికారి తనిఖీలు చేయడం లేదు. ఇంటింటా చెత్తసేకరణ, రహదారుల్లో చెత్త చెదారం పేరుకుపోయింది. మురుగు కాల్వలు తీయడం లేదు.

క్షేత్రస్థాయి సమస్యలు ఇలా.. తాగునీటి సరఫరాకు సమయ పాలన లేదు. ఇంజినీర్లు చెబుతున్నదొకటి, క్షేత్రస్థాయిలో జరుగుతున్నదొకటిగా ఉంది. చాలాచోట్ల లీకేజీలతో తాగునీరు వృథా అవుతోంది. గ్రేటర్, పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ల మధ్య సమన్వయ లోపం ఉంది. డివిజన్లలో ఆకస్మిక తనిఖీలు చేయడం లేదు. వచ్చేది వానాకాలం, ఇంత వరకు నాలాల పూడికతీత పనులు మొదలు పెట్టలేదు. టెండర్లు, ఒప్పందాలైనా పనులు ప్రారంభం కావడం లేదు. దోమల సమస్య ఎక్కువగా ఉంది. నివారణ చర్యలు, సాయంత్ర వేళల్లో ఫాగింగ్ సరిగా జరగడం లేదు.

అధికారుల ఇష్టారాజ్యం

కమిషనర్ లేకపోవడంతో గ్రేటర్ వరంగల్‌లో వింగ్ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సెలవులొస్తే చాలు నగరం విడిచి వెళ్తున్నారు. చాలా మంది వింగ్ అధికారులు ఫోన్లు ఎత్తడం లేదు.బల్దియా ప్రధాన కార్యాలయం, కాజీపేట, కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయాల్లో ఉద్యోగులు సీట్లలో ఉండటం లేదు. అటెండెన్సు వేసి బయటకెళ్తున్నారు. ఆస్తిపన్ను, పేరుమార్పిడి, ఆస్తుల విభజన, నల్లా కనెక్షన్లు, భవన నిర్మాణ అనుమతులు, పౌరసేవలు ఆలస్యమవుతున్నాయి. అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కోసం ఇద్దరు ఎస్‌ఈలున్నారు. స్మార్ట్‌సిటీ, నీటి సరఫరాకు ఒకరు, ఇతర పనులకు మరొక ఎస్‌ఈ అధికారి ఉన్నారు.అభివృద్ధి పనులు చేసేందుకు ఇదే మంచి తరుణం. వర్షకాలంలో పనులు చేయడం ఇబ్బందిగా ఉంటుంది. లి స్మార్ట్‌సిటీ పనులు నత్త నడకగా సాగుతున్నాయి. బడా గుత్తేదారులు కావడంతో ఇంజినీర్లను ఖాతరు చేయడం లేదు.

ప్రజావాణి అర్జీలు బుట్టదాఖలు

ప్రతి బల్దియాలో జరుగుతున్న ప్రజావాణిలో 50–70 అర్జీలు వస్తున్నాయి. బాధితులు ఎంతో దూరం నుంచి సమస్యలు వివరిస్తే వింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక, పన్నుల విభాగాల్లో సమస్యలు పరిష్కరించడం లేదు. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

అదనపు బాధ్యతల భారం..

గ్రేటర్ వరంగల్ పూర్తి అదనపు బాధ్యతల కమిషనర్‌గా వరంగల్ జిల్లా పాలనాధికారి ప్రావీణ్యను నియమించారు. కలెక్టర్‌గానే బాధ్యతలు ఎక్కువగా ఉంటాయి. రోజూ సమావేశాలు, సమీక్షలు, గ్రామాల పర్యటనలతో తీరిక లేకుండా ఉంటున్నారు. బల్దియా కమిషనర్, 'కుడా' వీసీ బాధ్యతలు నిర్వహించడం తలకు మించిన భారంగానే ఉంటుంది.

మంచినీళ్లు వస్తలేవుహఫీజ్, 41వ డివిజన్, వరంగల్

మా కాలనీకి మూడు రోజుల నుంచి మంచినీళ్లు రావడం లేదు. అసలే ఎండాకాలం. తాగునీళ్లు లేక బాగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. అధికారులు ఎవరూ మా సమస్య పట్టించుకోవడం లేదు. వెంటనే నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

# చల్లచల్లగా.. పైకప్పు విధానం!

వరంగల్ : గతంలో ఇళ్ల పైకప్పులపై చల్లదనం కోసం చెట్ల కొమ్మలు, కొబ్బరి మట్టలు, తాటికమ్మలు, మట్టిగూన పెంకులు వేసుకునేవారు. ఏటా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో చల్లదనం కోసం కొత్త సాంకేతిక రీతులను అనుసరిస్తున్నారు.దేశంలోనే తొలిసారిగా..ఈ పరిస్థితుల్లో.. ఇంధన పొదుపుతో పాటు, ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా 'చల్లని పైకప్పు (2023–2028) విధానాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 300 చ.కి.మీ చలువ పైకప్పు ఏర్పాటే లక్ష్యం.వీటికి తప్పనిసరి: 600 చదరపు గజాలు, అంతకు మించి విస్తీర్ణం కలిగిన స్థలంలో నిర్మించే నివాస భవనాలు, ప్రభుత్వ భవనాలు, స్థల విస్తీర్ణం, నిర్మిత పరిమాణం(బిల్టప్ ఏరియా)తో సంబంధం లేకుండా అన్ని నివాసేతర, వ్యాపార, వాణిజ్య భవనాలు, ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలయ్యే అన్ని గృహనిర్మాణ పథకాలకు ఈ విధానం వర్తిస్తుంది.ఎవరికి ఐచ్ఛికం?: సౌర విద్యుత్తు ఉత్పత్తి వ్యవస్థ ఉన్న భవనాల్లో చలువ కప్పు విధానాన్ని అనుసరించవచ్చు. రానున్న మూడేళ్లలో అన్ని నివాసేతర భవనాలకు వర్తింపజేస్తారు. ప్రస్తుతం ఈ విధాన పరిధిలోకి భవనాల యజమానులు చలువ పైకప్పుతో ఒనగూరే ప్రయోజనాలు పొందేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావచ్చు.

టీఎస్‌బీపాస్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులునిర్మాణ అనుమతులు పొందేందుకు అమలవుతున్న టీఎస్‌బీపాస్ సాఫ్ట్‌వేర్‌లోనూ మార్పులు ఉంటాయి. నిర్దేశిత విస్తీర్ణంలో నిర్మించే వారు చలువ పైకప్పు విధానాన్ని అనుసరించినట్లు రుజువులు చూపిన తరువాతే, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేలా నిబంధనలు రూపొందించారు. ఈ నెల ఒకటి నుంచి ఈ విధానం అమలులోకి వచ్చినట్లు పురపాలక శాఖ ప్రకటించింది. 2023–24కు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికలు, నగర పాలికలకు లక్ష్యాన్ని నిర్దేశించారు. సిమెంటు కాంక్రీటుతో నిర్మించే భవనాల పైకప్పులు త్వరగా వేడెక్కుతాయి. దీంతో ఇంటిలోపల వేడి ప్రభావం ఉంటుంది. దీన్ని తట్టుకునేందుకు ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగం పెరుగుతోంది. చలువ పైకప్పు విధానంలో స్లాబుపైన తెల్లని రంగు వేస్తారు. ప్రస్తుతం లైమ్‌వాష్/అక్రిలిక్ పాలిమర్/ప్లాస్టిక్ సాంకేతికతతో కూడిన తెల్ల రంగు(పెయింట్)ను పూస్తున్నారు. పాలీవినైల్‌క్లోరైడ్ విధానం అందుబాటులో ఉందని, సిరామిక్ మొజాయిక్, ఆల్బిడో టైల్స్‌ను పరిచే విధానం నగరాల్లో ఉందని భవన నిర్మాణదారులు చెబుతున్నారు. చలువ పైకప్పులు వేడిమిని తక్కువగా గ్రహిస్తాయని, సాధారణ పైకప్పుల కంటే, ఇవి 80 శాతం మేర సూర్యకిరణాలను పరావర్తనం చెందిస్తాయని పేర్కొన్నారు.

అమలుకు చర్యలు–ఆర్.వీరస్వామి, టీపీవో, డీటీసీపీవో, జనగామచలువ పైకప్పు విధానానికి సంబంధించి ప్రాథమిక ఆదేశాలు జారీ అయ్యాయి. పూర్తి స్థాయి ఆదేశాలు రావాల్సి ఉంది. ప్రభుత్వ భవనాలు, వ్యాపార సముదాయాలకు కూల్‌రూఫ్ నిబంధన వర్తిస్తుంది. చలువ పైకప్పునకు ఎలాంటి సాంకేతికత అనుసరించాలి.. తదితర అంశాలకు సంబంధించి త్వరలో పూర్తి సమాచారం అందుతుందని భావిస్తున్నాం.

# అవగాహనతోనే జలసంరక్షణ

ధర్మపురి : జిల్లాలోని ఐదు పురపాలికల్లో నల్లాల ద్వారా అందించే నీరు వృథా కావడంపై పుర అధికారులు, కౌన్సిలర్లు దృష్టి సారించారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నీటిని వృథా కానివ్వకుండా సద్వినియోగపరచుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రజలను చైతన్యపరుస్తూ..ప్రతి గ్రామానికి, ఇంటింటికీ ఎంత దూరం నుంచి నీరు వస్తోంది. ప్రతి లీటరు నీటిని సేకరించి శుద్ధి చేయడానికి ఎంత ప్రజాధనం వ్యయం అవుతోంది. నిత్యం ఏ మేరకు జలాలు వృథా అవుతున్నాయి. తదితర విషయాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి నీటిబొట్టును సద్వినియోగపరుచుకునేలా స్థానికులను చైతన్యపరుస్తున్నారు పుర అధికారులు. అంతే కాకుండా నీరు వృథా అయ్యే ప్రాంతాలను గుర్తించి అడ్డుకట్ట వేస్తున్నారు. పలుచోట్ల నూతనంగా పైపులైను పనులను చేపడుతున్నారు. అత్యవసర పద్దు కింద నిధులు విడుదల చేస్తున్నారు.ఇదీ పరిస్థితి..

జిల్లాలోని ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఓ వైపు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ పనులతో చాలా చోట్ల మిషన్ భగీరథ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో పైపులైను వేసిన కొన్నాళ్లకే మళ్లీ తవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. వీటిని అధిగమించడానికి అధికారులు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు.

ఐదు వార్డులు.. ఐదువందల ఇళ్లు

జిల్లాలోని ఐదు పురపాలికలున్నాయి. ప్రతి పురపాలికలో తొలుత ఎంపిక చేసిన ఐదు వార్డుల్లో ఐదు వందల ఇళ్ల వద్ద పుర అధ్యక్షులు,



కౌన్సిలర్లు, అధికారులు, ఆర్పీలు, తాగునీటి సిబ్బంది కలిసి పర్యటిస్తున్నారు. నేరుగా నీటి సరఫరా జరిగే సమయంలో ఇళ్లకు వెళ్లి పరిశీలించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

నీటి వృథాపై అవగాహన – సీహెచ్ రమేష్, పుర కౌన్సిలర్, ధర్మపురి

నీటి వృథాపై ప్రజలకు ఎంపిక చేసిన వార్డుల్లో అవగాహన కల్పిస్తూ, తాగునీటి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని భావిస్తున్నాం. వార్డుల్లో ప్రజలకు నీటి లీకేజీపై అవగాహన కల్పించి తాగునీటి పథకం పనులకు నిధులు మంజూరు చేస్తున్నాం. అత్యవసర నిధుల పద్దు కింద రూ.35 లక్షల నిధులు కేటాయించాం. ధర్మపురిలో ఇందిరమ్మ కాలనీ, తెనుగువాడ కాలనీలో కొత్త పైపులైను నిర్మాణాలు చేపడుతున్నాం. ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాం.

# జిల్లాకు రాయితీ నిధులు రూ.39.89 కోట్లు

కరీంనగర్ : పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందితే ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తోందనేది రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశం. తెలంగాణ ఏర్పడిన తర్వాత పారిశ్రామిక విధానంలో అనేక సంస్కరణలు చేసింది. టీఎస్‌ఐపాస్ ద్వారా ప్రభుత్వం సత్వర అనుమతులు ఇస్తోంది. పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వచ్చే వారికి పలు రాయితీలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా టీ–ప్రైడ్, టీ–ఐడియా పథకాల ద్వారా ప్రోత్సాహకాలు అందజేస్తోంది. రాయితీ నిధులకు సంబంధించి పారిశ్రామికవేత్తలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న తరుణంలో అందుకు సంబంధించిన నిధులను సర్కారు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

1,829 యూనిట్లు

కరీంనగర్ జిల్లాలో టీ–ఐడియా, టీ–ప్రైడ్ కింద అన్ని విభాగాల్లో 1,829 యూనిట్లకు రూ.244.05 కోట్లు రాయితీ కింద రావాల్సి ఉంది. ఇందులో పెట్టుబడి రాయితీ కింద 819 యూనిట్లకు రూ.174.53 కోట్లు, పావలా వడ్డీ కింద 766 యూనిట్లకు రూ.34.24 కోట్లు, విద్యుత్తు రాయితీ విభాగంలో 244 యూనిట్లకు రూ.35.28 కోట్లు రావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా గ్రానైట్ పరిశ్రమలకు రూ.వంద కోట్ల వరకు ప్రోత్సాహకాలు రావాల్సి ఉందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఎస్సీ, ఎస్టీలకు మేలు

పారిశ్రామికవేత్తలు రాయితీ నిధుల కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు సర్కారు నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.



అయితే పూర్తిస్థాయిలో నిధులు రాకపోవడంతో కొంతవరకు పరిశ్రమల వర్గాల్లో నిరాశ కన్పిస్తోంది. కేవలం ఎస్సీ విభాగంలో 15.58 కోట్లు, ఎస్టీ విభాగంలో రూ.2.61 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. జనరల్ విభాగంలో రూ.21.7 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినా.. అవి కూడా సిక్ ఇండస్ట్రీస్‌కు మాత్రమేనని అధికారులు చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రం 2020 నవంబర్ వరకు ఉన్న రాయితీ బకాయిలను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్ తెలిపారు. 2015 నుంచి ఎదురు చూస్తున్న రాయితీ నిధులు రాలేదని.. కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని పరిశ్రమలకు రాయితీ నిధులు వచ్చాయని పరిశ్రమల యజమానులు తెలిపారు. ఏళ్లుగా రాయితీ నిధుల కోసం ఎదురు చూస్తున్నామని, మా తర్వాత పరిశ్రమలు స్థాపించిన వారికి రాయితీ నిధులు వచ్చినట్లు తెలిసిందని, పైరవీలు జరిగినట్లు అనుమానంగా ఉందని పలువురు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలిఎనిమిదేళ్లుగా పరిశ్రమలకు ఇచ్చే ప్రోత్సాహకాలు రావడం లేదు. ప్రభుత్వం పెట్టుబడి, విద్యుత్తు, పావలా వడ్డీకి సంబంధించి రాయితీ నిధులను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలి. పరిశ్రమలు నడపడా నికి తెచ్చిన రుణాలు చెల్లించడం ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం సహృదయంతో అర్థం చేసుకొని నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలి. ఇప్పటికే 30 పరిశ్రమల వరకు మూతపడ్డాయి.జిల్లా అశోక్‌కుమార్, గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ అసోసియేషన్ కోశాధికారి



# జగన్ వ్యూహం సిద్ధం.. ప్రతి నెలా సగం రోజులు జిల్లాల్లోనే!

అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో వచ్చే ఎన్నికల్లో 175కి 175 సీట్లు సాధించాలనే లక్ష్యంతో ఏపీ సీఎం వైసీపీ అధినేత జగన్ ఉన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో వైసీపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇంచార్జులు ఇంటింటికీ తిరుగుతున్నారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు వరకు కొనసాగించాలని నిర్ణయించారు. మరోవైపు 'జగనన్నే మా భవిష్యత్తు' పేరుతో వైసీపీ నేతలు ఇంటింటికీ వెళ్తున్నారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం వల్ల ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ తమనే గెలిపించాలని కోరుతున్నారు. అంతేకాకుండా లబ్ధిదారుల ఇళ్లకు 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో రూపొందించిన స్టిక్కర్లను అంటిస్తున్నారు. ఇంకోవైపు సీఎం వైఎస్ జగన్ కూడా వివిధ పథకాల లబ్ధిని లబ్దిదారుల ఖాతాల్లో జమ చేయడానికి తరచూ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. అంతకుముందు సీఎం క్యాంపు కార్యాలయం నుంచి నగదు జమ చేసేవారు. అయితే ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఒక్కో పథకానికి ఒక్కో జిల్లాను ఎంచుకుని అక్కడి నుంచి లబ్ధిని జమ చేస్తున్నారు. భారీ బహిరంగ సభలను సైతం నిర్వహించి ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు సంధిస్తున్నారు. అయితే ఇక నుంచి ప్రతి నెలలో 15 రోజులు జిల్లాల్లోనే ఉండేలా సీఎం జగన్ రూట్ మ్యాప్ ను సిద్ధం చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఇప్పటికే ప్రతిపక్ష నేత టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. నియోజకవర్గాల సమీక్షలు అభ్యర్థుల ఎంపిక పార్టీ బలాబలాలు స్థితిగతులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంకోవైపు చంద్రబాబు కుమారుడు నారా లోకేష్ రాష్ట్రంలో యువగళం పేరుతో పాదయాత్ర చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన పాదయాత్ర కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజకవర్గానికి చేరుకుంది. శ్రీకాకుళం జిల్లాలోని ఇచ్ఛాపురం వరకు లోకేష్ పాదయాత్ర సాగనుంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల దూకుడును తట్టుకోవాలంటే తాను సైతం ప్రజల్లోనే ఉండాలని జగన్ నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇక ప్రతి నెలా ఆయా జిల్లాల్లో 15 రోజుల చొప్పున ఉండాలని రూట్ మ్యాప్ రూపొందించుకుంటున్నట్టు చెబుతున్నారు. ఈ నాలుగేళ్లలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాల లబ్ధి గత ప్రభుత్వానికి తమ ప్రభుత్వానికి తేడా తదితరాలను ప్రజలను నేరుగా కలిసి జగన్ వివరించనున్నట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ఏపీ రాజకీయం వేడెక్కనుంది.

# 'కుప్పం'పై చంద్రబాబు కీలక నిర్ణయాలు..లక్ష మెజార్టీనే లక్ష్య మట



చిత్తూరు : ఎట్టకేల కు టీడీపీ అధినేత చంద్రబాబు తాను ప్రాతనిధ్యం వహించే కుప్పం నియోజకవర్గం పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో అధికార వైసీపీ మొదటి గెలుపు కుప్పం తోనే మొదలు కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సీరియస్ గా పని చేస్తున్న వేళ.. ఆత్మరక్షణ ధోరణిని ప్రదర్శించిన బాబు.. ఇప్పుడు అందుకుభిన్న మైన తరహాలో పని షురూ చేశారు. మొన్నటివరక కు ఆచితూచి అన్నట్లుగా వ్యవహరిస్తూ.. ముందుకు ఎలా వెళ్లాలన్న దాని పై బోలెడంత కన్ఫ్యూజన్ లో ఉన్న విషయం తెలిసిందే. ఇటీవల వెల్ల డైన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో చంద్రబాబు కొత్త ఉత్సాహానికి గురైనట్లు గా కనిపిస్తోంది. వచ్చే ఎన్నికల్లోనూ కుప్పం నుంచి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న చంద్రబాబు.. ఈసారి ఎన్నికల్లో తనకు లక్ష మెజార్టీ వచ్చేలా చేయాలన్న టాస్కును ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన కంచర్ల శ్రీకాంత్ కు అప్పగించారు. నియోజకవర్గ ఇంఛార్జ్ గా పీఎస్ మునిరత్నం.. సమన్వయ కమిటీ కన్వీనర్ గా చంద్రశేఖర్ కు బాధ్యతలు అప్పజెప్పారు. మొత్తం31 మందిని కోర్ టీం గా ఎంపిక చేసిన చంద్రబాబు వచ్చే ఎన్నికల్లో తన మెజార్టీ లక్ష మార్కును దాటించటమే మీదనే ఫోకస్ చేసేందుకు వీలుగా కసరత్తు పూర్తి చేశారు. తాజాగా టాస్కు ను అప్పజెప్పిన నేపథ్యంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్ ను వారంలో మూడు రోజులు కుప్పం నియోజకవర్గం లోనే ఉండి.. పని చేస్తున్నారు. అధినేత ఇచ్చిన అతి ముఖ్య మైన టాస్కు ను విజయవంతంగా పూర్తి చేసేందుకువీలుగా.. ఆయన పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తల్ని పరామర్శించటంతో పాటు.. తమ వారి పై అక్రమ కేసులు పెడుతున్న పోలీసుల పై ప్రైవేటు కేసులు బుక్ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. మరో వైపు కుప్పంలో చోటు చేసుకుంటున్న పరిణామాల పై తాజాగా రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి కి చంద్రబాబు లేఖ రాశారు. వైసీపీనేతల ఆదేశాలతో 34 మంది టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేసేందుకు రంగం సిద్ధంచేశారు. పోలీసుల తీరును తీవ్రంగా తప్పు పడుతూ.. వైసీపీ నేతల విషయంలో ఒకలా.. టీడీపీ నాయకుల విషయంలో మరోలా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. పోలీసు.. రెవెన్యూ అధికారులు కలిసి టీడీపీ కార్యకర్తల పై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. అక్రమకేసులు నమోదు చేసిన డీఎస్పీ సుధాకర్ రెడ్డి.. సీఐ శ్రీధర్.. ఎస్ఐ క్రిష్ణయ్యల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మొత్తంగా కుప్పం మీద చంద్రబాబు స్పెషల్ ఫోకస్ పెట్టారని మాత్రం చెప్పక తప్పదు.

# ఎన్టీఆర్ అభిమానులను బాధపెట్టేలా రజనీకాంత్ మాట్లాడారు: మంత్రి రోజా




విజయవాడ: సూపర్ స్టార్ రజినీకాంత్ వ్యాఖ్యలకు మంత్రి రోజా కౌంటర్ ఇచ్చారు. రజనీకాంత్‌కు తెలుగు రాష్ట్రం, రాజకీయాలపై అవగాహన లేదని విమర్శలు చేశారు. రజనీకాంత్ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ ఆత్మ కూడా బాధపడుతుందన్నారు. కాగా, మంత్రి రోజా శనివారం మీడియాతో మాట్లాడుతూ.. 'రజనీకాంత్‌తో చంద్రబాబు అబద్ధాలు చెప్పించారు. ఎన్టీఆర్ ఏమన్నారో.. రజనీకాంత్‌కు వీడియోలు ఇస్తాను. ఎన్టీఆర్‌పై దారుణంగా కార్టూన్లు వేసి అవమానించిన వ్యక్తి చంద్రబాబు. రజనీకాంత్‌కు తెలుగు రాష్ట్రం, రాజకీయాలపై అవగాహన లేదు. రజనీకాంత్ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ ఆత్మ కూడా బాధపడుతుంది. ఎన్టీఆర్ అభిమానులను బాధపెట్టేలా రజనీకాంత్ మాట్లాడారు.

చంద్రబాబు లేనప్పుడే హైదరాబాద్ అభివృద్ధి చెందింది. విదేశాల్లో తెలుగువారు ఉద్యోగాలు పొందడానికి కారణం వైఎస్సార్. ఇందుకు కారణం చంద్రబాబు కాదని రజనీకాంత్ తెలుసుకోవాలి. ఫీజు రియింబర్స్‌మెంట్ తెచ్చింది వైఎస్సార్.. చంద్రబాబు కాదు. చంద్రబాబు విజన్ 2020 వల్ల టీడీపీ 23 సీట్లకు పరిమితమైంది. విజన్ 2047కి చంద్రబాబు ఏ దశలో ఉంటారో రజనీకాంత్‌కి తెలుసా?. ఇలాంటి వ్యాఖ్యలు చేసి.. రజనీకాంత్‌పై తెలుగు ప్రజలకు ఉన్న గౌరవం తగ్గించుకున్నారు. ఇంతలా మాట్లాడేవారు 27 ఏళ్లలో ఎన్టీఆర్‌కు భారతరత్న ఎందుకు ఇప్పించలేదు.

ఎన్టీఆర్ యుగపురుషుడు అన్న వారు ఎందుకు వెన్నుపోటు పొడిచారు?. రజనీకాంత్ చెప్పినట్టు 2024లో చంద్రబాబు సీఎం అయ్యే అవకాశమే లేదు. రజనీకి ఎన్టీఆర్‌ను అసెంబ్లీలో ఎలా అవమానించారో రికార్డులు పంపిస్తాను' అని కామెంట్స్ చేశారు.




దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ అగ్రశ్రేణి రెజ్లర్లు చేపట్టిన ఆందోళన కొనసాగుతోంది. వీరి నిరసనకు భారత క్రీడాలోకంతో పాటు పలు రాజకీయ పార్టీలు కూడా మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ ఉదయం కాంగ్రెస్ అగ్రనేత, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కూడా రెజ్లర్లకు సంఘీభావం పలుకుతూ దీక్షలో పాల్గొన్నారు. ఈ ఉదయం జంతర్ మంతర్ వద్ద దీక్షా శిబిరానికి వచ్చిన ఆమె.. రెజ్లర్లతో మాట్లాడి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా మహిళా రెజ్లర్లు సాక్షి మాలిక్, వినేశ్ ఫొగాట్.. ప్రియాంకకు తమ సమస్యలను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కాంగ్రెస్ నాయకురాలు కేంద్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. "బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని పోలీసులు చెబుతున్నారు. కానీ ఇంతవరకూ ఆ కాపీలను బయటకు చూపించలేదు. అందులో ఏముందో ఎవరికీ తెలియదు. ఎఫ్ఐఆర్ కాపీలను ఎందుకు బయటపెట్టట్లేదు? ఈ రెజ్లర్లు పతకాలు గెలిచినప్పుడు మనమంతా ట్విటర్‌లో పోస్ట్ చేసి గర్వపడ్డాం. ఇప్పుడు అదే క్రీడాకారులు న్యాయం కోసం రోడ్డెక్కారు. మహిళా రెజ్లర్లంతా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మరో గత్యంతరం లేక ఇలా గొంతెత్తారు. కానీ, ప్రభుత్వం మాత్రం వీరి ఆవేదనను వినకుండా బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు కాపాడాలని ప్రయత్నిస్తోంది? వీరి సమస్యను ప్రధాని మోదీ పరిష్కరిస్తారన్న నమ్మకం లేదు. ఒకవేళ వీరి గురించి ఆయన ఆందోళన చెంది ఉంటే.. ఇంతవరకూ రెజ్లర్లతో ఎందుకు మాట్లాడలేదు? కనీసం వీరిని కలవడానికి కూడా ప్రయత్నించలేదు" అని ప్రియాంక దుయ్యబట్టారు. రెజ్లర్లకు యావత్ దేశం అండగా నిలుస్తుందని ఆమె ధైర్యం చెప్పారు. బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా తమ ఆందోళనకు మద్దతివ్వాలని ఇటీవల రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలను రెజ్లర్లు కోరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కాంగ్రెస్ నేతలు భూపిందర్ హుడా, దీపిందర్ హుడా, ఉదిత్ రాజ్ సహా పలువురు నాయకులు రెజ్లర్ల దీక్షలో పాల్గొన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా నేడు క్రీడాకారులను కలిసి మద్దతివ్వనున్నట్లు తెలుస్తోంది.




విశాఖ: విశాఖలో కలకలం సృష్టిస్తోన్న కిడ్నీ రాకెట్ ముఠా వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్న విశాఖ క్రైం బ్రాంచ్ పోలీసులు.. బాధితులను ప్రేరేపించిన ముఠా సభ్యులు, అనుమతి లేకుండా చికిత్సలు చేసి వ్యవహారాన్ని నడిపించిన వైద్యులను ఒక్కొక్కరిగా అదుపులోకి తీసుకుంటున్నారు. ఈ ఆపరేషన్లు చేసిన ప్రైవేటు డాక్టర్ ఒక కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ కావడం.. ఆయన కాకినాడలో ఉన్నారన్న సమాచారంతో రెండు ప్రత్యేక బృందాలు అక్కడికి వెళ్లి గాలిస్తున్నాయి. దర్యాప్తులో భాగంగా విశాఖ సీసీఎస్ డీసీపీ ఆనంద్‌రెడ్డి నేతృత్వంలోని బృందం.. ముఠా సభ్యులు కనకరాజు, శ్రీను, ఇలియానాతో పాటు మరికొంత మందిని ప్రశ్నిస్తున్నారు. వీరి నుంచి సమాచారం రాబట్టేందుకు ప్రయత్నిస్తు న్నారు. బాధితులను ట్రాప్ చేయడం నుంచి మొదలు.. వారికి కిడ్నీ ఆపరేషన్లు చేసే వరకు జరిగిన క్రమంపై పోలీసులు ఆరాతీస్తున్నారు. పెందుర్తిలోని తిరుమల ఆస్పత్రిలో కిడ్నీ శస్త్ర చికిత్సలు జరిగాయని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. తిరుమల ఆస్పత్రి యజమాని డాక్టర్ పరమేశ్వరరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

**ఒంటరి మహిళలే లక్ష్యంగా..** తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు, ఒంటరి మహిళలు, పేద కాలనీలకు చెందిన వారినే ఈ ముఠా టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. వారి అవసరాలను ఆసరాగా తీసుకొని కిడ్నీ తీసుకోవడం లేదా అద్దె గర్భం దాల్చడానికి అంగీకరిస్తే పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తామని వారికి ఆశ చూపించినట్లు సమాచారం. అవయవదానం చేసేందుకు పాటించాల్సిన అధికారిక ప్రక్రియను పాటించకుండా దొంగ పత్రాలు సృష్టించి అనధికారికంగా శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఎంత మంది బాధితులు ఉన్నారు? ఈ ముఠా సభ్యులు ఏఏ కాలనీలపై దృష్టి పెట్టారు? ఎవరెవరిని సంప్రదించారు? అనే కోణంలో పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. బాధితులు కూడా పెద్ద సంఖ్యలో ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.




బెంగళూరు: 'నన్ను నిందించిన ప్రతిసారి, కాంగ్రెస్ పార్టీనే పతనమవుతోంది' అని ప్రతిపక్షంపై ప్రధాని నరేంద్రమోదీ భగ్గుమన్నారు. ఇటీవల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను ఉద్దేశించి ఈ మాట అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని ప్రస్తుతం కర్ణాటకలో పర్యటిస్తున్నారు. 'కాంగ్రెస్ మళ్లీ నన్ను నిందించడం ప్రారంభించింది. నన్ను నిందించిన ప్రతిసారి.. అది పతనమవుతోంది. కాంగ్రెస్ ఇప్పటికీ 91సార్లు నన్ను అవమానించింది. దుర్భాషలాడే పని కాంగ్రెస్‌ను చేసుకోనివ్వండి. నేను మాత్రం కర్ణాటక ప్రజల కోసం పనిచేస్తాను. వారు లింగాయత్ వర్గాన్ని నిందించారు. అంబేడ్కర్, వీర్ సావర్కర్‌ను అవమానించారు. వారి నిందలకు ప్రజలు ఓట్లతో బదులిస్తారు. భాజపాపై ఎంత బురదచల్లితే.. కమలం అంతగా వికసిస్తుంది' అని కార్యకర్తలనుద్దేశించి మోదీ అన్నారు. ఈ ఎన్నికలు రాష్ట్రంలో ఒక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం కాదనీ.. ఈ రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా చేయడానికని పేర్కొన్నారు. అలాగే డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటే.. రాష్ట్రం డబుల్ స్పీడ్‌తో దూసుకెళ్తుందని వ్యాఖ్యానించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ప్రస్తుతం మోదీ కర్ణాటకలో ఉన్నారు. శనివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం సాయంత్రం బెంగళూరుకు చేరుకుంటారు.

బెంగళూరు నార్త్‌లో రోడ్ షోలో పాల్గొంటారు. రేపు సాయంత్రం మైసూర్ నుంచి దిల్లీకి పయనమవుతారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓ విష సర్పం లాంటివారు. ఆయన తెచ్చిన పథకాలు చూసేందుకు ఆకర్షణీయంగా ఉన్నాయని రుచి చూస్తే చావు తప్పదు' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఇదివరకు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో ఆయన తన మాటల ఉద్దేశం వేరని వివరణ ఇచ్చుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని విష సర్పమని తాను అనలేదని.. ఆ పార్టీ విధానాలు విషపూరితమని మాత్రమే అన్నానని ఖర్గే వివరించారు. దీనికి కౌంటర్‌గా భాజపా నేత ఒకరు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీపై అదే తరహాలో తీవ్ర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.




# వైసీపీకి షాక్ ఇచ్చిన బాలినేని శ్రీనివాస్

ప్రకాశం: వైసీపీ అధిష్టానంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారు. వైసీపీ రీజినల్ కో- ఆర్డినేటర్ పదవికి బాలినేని రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ కార్యాలయానికి పంపించినట్లు తెలుస్తోంది. మంత్రి పదవి నుంచి బాలినేనిని తప్పించిన జగన్.. ఆయనను ప్రస్తుతం చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల వైసీపీ సమన్వయ కర్తగా నియమించారు. అయితే జిల్లాకు చెందిన ఆదిమూలపు సురేష్‌కు.. జగన్ కేబినెట్‌లో రెండో సారి చోటు దక్కింది. దీనిపై బాలినేని ఆగ్రహంతో ఉన్నారు. అలాగే తనకు వ్యతిరేకంగా పార్టీలో కొంతమంది పనిచేస్తున్నారని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇటీవల మార్కాపురంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ వద్ద పోలీసులు తనను అడ్డుకోవడంపై బాలినేని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ముఖ్యమంత్రి స్వయంగా ఫోన్ చేస్తే తప్ప బాలినేని వేదికపైకి రాలేదు. ప్రోటోకాల్ ఇష్యూ నుంచి పార్టీ అధిష్టానంపై బాలినేని గుర్రుగా ఉన్నారు. ప్రకాశం జిల్లా రాజకీయాల్లో సీనియర్ నేత, వైఎస్ జగన్‌కు దగ్గరి బంధువైన బాలినేని.. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు నుంచి జగన్‌తో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న సమయంలో మంత్రి పదవిని కూడా త్యాగం చేసి జగన్ పార్టీలో చేరారు. ఒంగోలులో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ తరుపున మొదటి సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి నుంచి జగన్ వెంటే ఉంటూ వచ్చారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బాలినేని మంత్రి పదవి చేపట్టారు. కానీ మూడేళ్లు తిరిగే సరికి ఆయనను జగన్ పక్కనపెట్టేశారు. అదే సమయంలో జిల్లాలో మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిమూలపు సురేష్‌ను మరోసారి మంత్రిగా కొనసాగించారు. అయితే జిల్లాలో ఉన్న ఇద్దరు మంత్రుల్లో ఒకరిని తొలగించి మరొకరిని కొనసాగించడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళతాయని అప్పట్లోనే జగన్‌కు బాలినేని వివరించారు. అయినప్పటికీ బాలినేని మాటలను పట్టించుకోని జగన్.. మంత్రిపదవి నుంచి బాలినేని తొలగించి.. ఆదిమూలపు సురేష్‌ను పురపాలక శాఖ మంత్రిగా కొనసాగించారు. దీంతో అప్పటి నుంచి జిల్లాలో ప్రోటోకాల్ విషయంలో బాలినేని తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల పరుచూరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకం విషయంలో బాలినేని చెప్పిన సూచనలు పట్టించుకోని పరిస్థితి. అయితే మంత్రి పదవి నుంచి బాలినేనిని తొలగించడం, ఆపై మార్కాపురంలో ప్రోటోకాల్ విషయంలో అసంతృప్తితో ఉన్న బాలినేని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే జిల్లాలో ముఖ్యమైన లీడర్‌గా ఉన్న బాలినేని... వైసీపీ రీజనల్ కో ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేయడం.. జిల్లా రాజకీయాలతో పాటు వైసీపీలో కలకలం రేపుతోంది.

# సీఎం జగన్‌పై అయ్యన్న సంచలన వ్యాఖ్యలు..




తూ.గో. జిల్లా: ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అయ్యన్న పాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. కాకినాడలో జరిగిన బీసీ ఐక్య కార్యాచరణ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలను అణగదొక్కుతున్నారని, 2500 మంది పోలీసులు లేనిదే ముఖ్యమంత్రి బయటికి రాలేని పరిస్థితని విమర్శించారు.

జైలుకు వెళ్లి వచ్చిన సీఎంకు పోలీసులు కాపలా..? అంటూ ఎద్దేవా చేశారు. వైసీపీ సెంటిమెంట్ చర్లపల్లి జైలుకు వెళ్లిరావడమేనని అన్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు పోలవరంపై అవగాహన లేదని విమర్శించారు. ఏపీలో బీసీ మంత్రుల పేర్లు ఎంతమందికి తెలుసునని అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు.

గరుడ వార్త



# షర్ట్ బటన్స్ అన్నీ విప్పేసి బాలయ్య హీరోయిన్ ఒళ్లు విరుపు

నందమూరి బాలకృష్ణ 'లెజెండ్' సినిమా తో తెలుగు లో మంచి పాపులారిటీని సొంతం చేసుకున్న ముద్దుగుమ్మ సోనాల్ చౌహాన్. సాధారణంగా హీరోయిన్స్ ఒక్క సూపర్ హిట్ పడితే ఎన్నో ఆఫర్లు దక్కించుకుంటూ ఉంటారు. అలాంటిది సోనాల్ చౌహాన్ కు లెజెండ్ వంటి భారీ విజయం దక్కినా కూడా ఆశించిన స్థాయిలో ఆఫర్లు రాలేదు. తెలుగు లో లెజెండ్ తర్వాత చేసిన సినిమాలు నిరాశ పర్చడం తో తక్కువ సమయంలోనే ఈమె ఫేడ్ అవుట్ అవ్వడం మొదలు అయ్యింది. తెలుగు లో అవకాశాలు తగ్గడంతో ఇతర భాషల్లో సినిమాలు



చేస్తూ అప్పుడప్పుడు టాలీవుడ్ లో కూడా గెస్ట్ రోల్స్ ను పోషిస్తూ సందడి చేస్తూ వస్తున్న సోనాల్ చౌహాన్ అందాల ఆరబోత విషయంలో ఎప్పుడు కూడా ముందు ఉంటుంది. ఈ అమ్మడి ఫోటోలు రెగ్యులర్ గా సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. స్కిన్ షో విషయంలో ఈ అమ్మడు ఎప్పుడు కూడా మొహమాటం అనేది పడకుండా ఫోటోలను షేర్ చేస్తూ ఉన్న విషయం తెల్సిందే. తాజాగా ఈ అమ్మడు మరోసారి తన అందాలను విందు చేసింది. ఒంటిపై షర్ట్ ఉంది కానీ.. ఆ షర్ట్ మొత్తం బటన్స్ ను విప్పేసి ఒళు విరుస్తూ కవ్విస్తూ ఉంది. ఎద సౌందర్యం ను ఈ అమ్మడు ఎక్స్పోజ్ చేస్తూ ఫోటోకు ఇచ్చిన ఫోజ్ మరోసారి వైరల్ అయ్యింది.

ఆకట్టుకునే రూపంతో పాటు సూపర్ స్కిన్ టోన్ ఈ అమ్మడిది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తూ ఉన్నారు. నడుము అందం చూపిస్తూ థైస్ తో మతి పోగొడుతున్న సోనాల్ చౌహాన్ అందంకు తగ్గట్లుగా ఆఫర్లు రావడం లేదంటూ సోషల్ మీడియాలో ఆమె అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## చిరుతో స్టెప్పు లేసేందుకు శ్రియ అంత తీసుకుందా..!

ఇష్టం సినిమాతో తెలుగు సినీ రంగంలో అడుగు పెట్టిన శ్రియా శరణ్.. తన అందం అభియనంతో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా ఎదిగిపోయింది. పెద్ద పెద్ద స్టార్ హీరోల సరసన కూడా నటిస్తూ.. వరుసగా ఛాన్సులు దక్కించుకుంటూనే వస్తోంది. 2001 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు సినిమాల్లో రాణిస్తూనే ఉంది. ఒక్క తెలుగులోనే కాకుండా తమిళ మలయాళ హిందీ కన్నడ చిత్రాల్లోనూ నటించి మెప్పించిందీ బ్యూటీ. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో.. ఇప్పుడు కూడా శ్రియ అదే ఫిజిక్ మెయింటెయిన్ చేస్తుంది. ఓ బిడ్డకు జన్మనిచ్చినా తన అందం ఏమాత్రం తగ్గలేదు. సినీ రంగంలో అడుగు పెట్టినప్పుడు ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. అయితే దాదాపు 20 ఏళ్ల తర్వాత



ఈ క్యూట్ బ్యూటీ మెగాస్టార్ చిరంజీవితో నటించబోతోంది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వం వహించబోతున్న భోళా శంకర్ సినిమాలో శ్రియా శరణ్ కనిపించబోతుంది. ఆయనతో ఓ స్పెషల్ సాంగ్ లో డ్యాన్స్ చేయబోతుందట. చిరుతో ఆమె స్టెప్పులు వేసేందుకు భారీగానే రెమ్యునరేషన్ కూడా తీసుకుంటుందట. ఒక్క పాటకే 70 లక్షల రూపాయలతో పాటు సెపరేట్ జీఎస్టీ తీసుకుంటుందట. చిరు శ్రియాలతో భోళా శంకర్ సినిమాలో స్పెషల్ సాంగ్ ఉంటుందని తెలిసప్పటి నుంచి మెగా అభిమానులు తెగ ఎగ్జైట్ అవుతున్నారు. అయితే ఈ సినిమాలో చిరంజీవి సరసన తమన్నా నటిస్తున్నారు. స్టార్ హీరోయిన్ కీర్తి సురేష్.. చిరంజీవికి చెల్లెలిగా కనిపించబోతోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రంలో రఘుబాబు మురళీ శర్మ రావు రమేష్ వెన్నెల కిషోర్ ప్రగతి.. తదితరులు కీలక పాత్రల్లో నటించబోతున్నారు. అయితే ఈ సినిమా చిరంజీవి నటించబోతున్న 154 వ సినిమా. అలాగే ఈ చిత్రానికి మహతి స్వర సాగర్ సంగీతం అందిస్తున్నారు. అన్నా చెల్లెలి అనుబంధం నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. తమిళంలో వేదాళం సినిమా సూపర్ హిట్టు కొట్టింది. ఈ చిత్రాన్ని ఎప్పటి నుంచో రీమేక్ చేయాలని ప్రయత్నించగా.. ఇప్పటికి కుదిరింది. అది కూడా మెగాస్టార్ చిరంజీవి ఖాతాలో పడింది. ఈ సినిమా షూటింగ్ మధ్యలో నత్త నడకగా సాగింది. దీంతో ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చిత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుందో ఎవరికీ తెలియదు.




# ఎంతమంది హీరోయిన్ల కోసం గుడులు కట్టారో తెలుసా..



హీరోలతో సమానంగా హీరోయిన్స్ కి కూడా అభిమానించే వారు ఉన్నారు. వారి పెర్ఫార్మెన్స్ కి ఫిదా అయిపోయి ఫ్యాన్స్ గామారిపోతారు. కొంతమంది ఫ్యాన్స్ అయితే తమ అభిమాన హీరోయిన్స్ పేర్లు ఫోటోలు పచ్చ బొట్లు కూడా వేయించుకుంటారు. కొంతమంది ఫ్యాన్స్ అయితే ఏకంగా గుడులు కట్టేసి వారిని దేవతలుగా మార్చేస్తూ ఉంటారు. ఈ రకమైన టెంపుల్స్ కట్టే సంస్కృతి తమిళనాట ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అక్కడ స్టార్ హీరోయిన్స్ కి ఫ్యాన్స్ ఆలయం కట్టేయడం ఒక అలవాటుగా ఉంది. 90వ దశకంలో కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన ఖుష్బూకి ఫ్యాన్స్ తిరుచురాపల్లిలో గుడి కట్టారు. అలా హీరోయిన్స్ కి టెంపుల్ కట్టే అలవాటు మొదలైంది. తరువాత సౌత్ లో స్టార్ హీరోయిన్ గా వెలుగొందిన నగ్మా కి కూడా ఫ్యాన్స్ గుడులు కట్టారు. ఒకప్పుడు గ్లామర్ క్వీన్ గా కుర్రకారుకి నిద్రలేకుండా చేసిన ఈ ముద్దుగుమ్మకి తమిళనాట ఆలయాలు కట్టారు. తరువాత హాట్ బాంబ్ నమితని కూడా అదే స్థాయిలో అభిమానించి కోయంబత్తూర్ తిరునెల్వేలి తో పాటు మరొక ప్రాంతంలో గుడులు కట్టారు. ఇక దేశముదురుతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి తరువాత కోలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా ఎదిగిన ముద్దుగుమ్మ హన్సిక అక్కడ విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ పెంచుకుంది. బొద్దుగుమ్మగా ఉంటూ తమిళ ప్రజల ఆరాధ్యంగా హాన్సిక మారిపోయారు. దీంతో చెన్నై శివారులో ఆమెకు గుడి కట్టారు. స్టార్ హీరోయిన్ కాజల్ కి కూడా తమిళనాట ఫ్యాన్స్ గుడి కట్టేశారు. ఈ జెనరేషన్ లో నిధి అగర్వాల్ కూడా తమిళంలో భూమి ఈశ్వర్ చిత్రాలలో నటించారు. రెండు సినిమాలతోనే ఆమెకి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ వచ్చేసింది. దీంతో చెన్నైలో ఆమెకి గుడి కట్టేశారు. ఇప్పుడు ఈ జాబితాలోకి సమంత వచ్చి చేరింది. అయితే మిగిలిన హీరోయిన్స్ అందరికి కూడా తమిళనాడులో అభిమానులు గుడులు కట్టారు. కాని సమంతకి ఏపీలో బాపట్ల జిల్లా చుండూరు మండలానికి చెందిన సందీప్ అభిమానంతో తన ఇంటి ఆవరణంలోనే గుడి కట్టారు. మాయోసైటిస్ నుంచి సమంత కోలుకోవాలని పుణ్యక్షేత్రాలు దర్శించారు. ఇప్పుడు గుడి కట్టి సోషల్ మీడియాలో వైరల్ అయ్యారు.

# బెదురులంక విడుదల ఎప్పుడో మరి?



ఆర్ఎక్స్ 100 సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టు కొట్టాడు హీరో కార్తికేయ. అయితే ఆ తర్వాత తీసిని ఏ ఒక్క సినిమా కూడా ఆయనకు అంత పెద్ద హిట్టును ఇవ్వలేకపోయింది. హిట్ట కాదు కదా కనీసం యావరేజ్ టాక్ కూడా దక్కడం లేదు. అయినా సరే అదృష్టం బాగుండి అతడికి వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. తాజాగా ఆయన వలిమై సినిమాలో విలన్ గా చేయడం వల్ల కూడా అతనికి ఎలాంటి ప్రయోజనమూ దక్కలేదు. అజిత్ ఎంతవాడుగాని సినిమాలో నటించాకే అరుణ్ విజయ్ కు స్టార్ డం వచ్చినట్లు తనకూ జరుగుతుందని ఆశించాడు.

కానీ అలా మాత్రం జరగలేదు. అయితే తాజాగా ఈ కుర్రహీరో బెదురు లంక 2012 అనే సినిమాలో హీరోగా నటించాడు. ఈ చిత్రం చాలా రోజుల క్రితమే పూర్తవ్వగా.. విడుదల తేదీలు మాత్రం వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే తాజాగా ఈ సినిమా ప్రమీయర్ ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలకు వేశారట. ఈ సినిమాను కొనడమో లేదా డిస్ట్రిబ్యూషన్ కు సహకరించడమో చేసేందుకే ఈ సినిమాను వాళ్లకు చూపించినట్లు ఇన్ సైడ్ టాక్. అయితే సినిమా చూశాక కొన్ని కీలక మార్పులు సూచించారట. ప్రస్తుతం దర్శకుడు క్లాక్స్ కీలక భాగాన్ని రీ షూట్ చేసే పనిలో పడ్డారట. 2012లో యుగాంతం వస్తుందనే పుకార్లను ఆధారంగా చేసుకొని కామెడీ ప్రధానంగా ఈ కథను రాసుకున్నారు. అయితే కథలో ఎగ్జైట్ పాయింట్ ఉండగానే సరిపోదని.. అది నేటి తరం యువతను అలరించేలా ఉంటేనే క్లిక్ అవుతుందని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు.

మరో వైపు సత్యదేవ్ తో కలిసి ఇప్పటికే స్కైలాబ్ చిత్రం రాగా ఫ్లాప్ అయింది. ఈ చిత్రం కూడా అలాంటి పాయింట్ తోనే తీసుకున్నారు. బెదురులంక సినిమాకు కూడా అలాంటి సమస్య రాకుండా ఉండాలంటే ముందే జాగ్రత్త వహించడం మంచిదని అంతా అంటున్నారు. ఈ క్రమంలోనే సినిమా రీ షూటింగ్ చిన్న చిన్న మార్పులు చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ సినిమాను ఏప్రిల్ లో రిలీజ్ అయితే చేయడం లేదు. మే కూడా కష్టమేనని తెలుస్తోంది. మరి ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో తెలియాలంటే ఇంకా కొంత కాలం ఆగాల్సిందే.

# రేటు పెంచిన గోల్డెన్ బ్యూటీ

వరుస సక్సెస్ లతో మంచి జోరు మీద ఉన్న మలయాళీ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్. ఈ అమ్మడు తాజాగా విరూపాక్ష మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ని ఖాతాలో వేసుకుంది. ఈ మూవీతో వరుసగా నాలుగు హిట్స్ తెలుగులో ఆమెకి వచ్చాయి. దీంతో గోల్డెన్ లెగ్ అనే బ్రాండ్ ని అప్పుడే సంయుక్త సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ అమ్మడుకి టాలీవుడ్ లో మంచి డిమాండ్ ఏర్పడింది. టైర్ 2 హీరోలు అందరూ కూడా సంయుక్తని లీడ్ గా తీసుకోవడానికి ఆసక్తి



చూపిస్తున్నారు. పెర్ఫార్మెన్స్ గ్లామర్ రెండింటికి కరెక్ట్ గా మేనేజ్ చేసే కేపబిలిటీ సంయుక్త దగ్గర ఉండటంతో ఆఫర్స్ గట్టిగానే వస్తున్నాయి. ఇక ఈ అమ్మడు డిమాండ్ పెరగడంతో రెమ్యునరేషన్ కూడా అమాంతం పెంచేసిందనే మాట వినిపిస్తోంది. విరూపాక్ష మూవీ వరకు సంయుక్త 50 నుంచి 70 లక్షల వరకు రెమ్యునరేషన్ తీసుకునేది. అయితే డిమాండ్ పెరగడంతో ఒక్కసారిగా 1.50 కోట్లకి రేట్ పెంచేసిందంట. కొత్త ప్రాజెక్ట్స్ కోసం ఈ స్థాయిలో రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నారంట. అయితే సంయుక్త లక్ ఫ్యాక్టర్ బాగుండటంతో ఆమెని హీరోయిన్ గా పెట్టుకోవాలని ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో ఆమె అడిగిన రెమ్యునరేషన్ ఇవ్వడానికి నిర్మాతలు కూడా రెడీ అయిపోతున్నారంట. ప్రస్తుతం ఈ బ్యూటీ కళ్యాణ్ రామ్ పాన్ ఇండి యా మూవీ డెవిల్ లో లీడ్ రోల్ చేస్తోంది. ఈ మూవీ షూటింగ్ దశ లో ఉంది. ఇక ఈ సినిమా సక్సెస్ అయితే పాన్ ఇండియా స్టార్ గా సంయుక్త మారిపోయే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. రష్మికని దాటుకొని టాప్ చైర్ లోకి ఇప్పుడు సంయుక్త మీనన్ వచ్చేలా ఉందనే టాక్ ఫిలిం నగర్ సర్కిల్ లో నడుస్తోంది. ఇక బింబిసారా మూ ఎవీ సూపర్ సక్సెస్ కావడంతో కళ్యాణ్ రామ్ డెవిల్ తో ఆమెని రిపీ ట్ చేశారు. అలాగే మిగిలిన హీరోలు కూడా సంయుక్తని తమ సినిమా లలో రిపీట్ చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సార్ మూవీ తర్వాత కోలీవుడ్ లో కూడా సంయుక్త డిమాండ్ పెరిగిందనే టాక్ వినిపిస్తోంది.

## చీర కట్టులో అనసూయ మేడం జోరు మామూలుగా లేదుగా..!

జబర్దస్త్ మాజీ యాంకర్ అనసూయ మరోసారి తన ఫోటోలతో వార్తల్లో నిలిచింది. ఇద్దరు పిల్లల తల్లి అయినా కూడా హీరోయిన్స్ స్థాయిలో తన ఫోటోలతో జనాల అటెన్షన్ ను దక్కించుకోగల సత్తా ఉన్న ముద్దుగుమ్మ అనసూయ అనడంలో సందేహం లేదు. ఈ ఫోటోలతో మరోసారి అనసూయ ఆ విషయాన్ని నిరూపించుకుంది. ఈమధ్య కాలంలో జబర్దస్త్ కార్యక్రమానికి దూరం అయిన అనసూయ వరుసగా సినిమాల్లో నటిస్తున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా కాకుండా పాత్రకు ప్రాముఖ్యత ఉన్న సినిమాల్లో



నటించడంతో పాటు ప్రత్యేక పాటల్లో మరియు పాత్రల్లో నటించడం ద్వారా అనసూయ మరింత మందికి చేరువ అవుతుంది. అనసూయ ప్రస్తుతం బుల్లి తెరకు దూరంగా ఉంటుంది. ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరో వైపు బుల్లి తెరపై కూడా నటించాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత చేసే అనసూయ మరోసారి తన చీర కట్టు తో కన్నులు తిప్పుకోకుండా చేసింది. చీర కట్టు లో క్లీవేజ్ షో చేసిన ఈ అమ్మడి యొక్క అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ఇంత అందంగా కొన్ని సార్లు హీరోయిన్స్ కూడా కనిపించరు మేడం.. మీరు ఎందుకు స్టార్ హీరోలకు జోడీగా హీరోయిన్ గా నటించడం లేదు అంటూ కొందరు ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తూ ఉంటే మరో పదేళ్లు అయినా మీరు ఇంతే అందంగా ఉండాలని కోరుకుంటున్నాం అంటూ కామెంట్స్ చేశారు.



# తెలంగాణలో పెట్టుబడులకు అపార అవకాశాలు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: పెట్టుబడులకు తెలంగాణలో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి కేటీఆర్ అన్నారు. గత తొమ్మిదేండ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు కాపీ కొడుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో జరుగుతున్న ఫుడ్ కాంక్లేవ్ - 2023 ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు నిరంజన్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఇవాళ ఐదు రెవల్యూషన్స్ తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ సీడ్ బాల్ ఆఫ్ ఇండియాగా ఎదుగుతున్నదని చెప్పారు. మత్స్య సంపదలో దేశంలోనే నెంబర్‌వన్‌గా ఉన్నామని, తెలిపారు. పౌల్ట్రీ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా తెలంగాణ రాష్ట్రం ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. హార్టికల్చర్, డైరీ రంగాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని చెప్పారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, వెటర్నరీ వర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గత ఐదేండ్లుగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. దేశ, విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ఈ రంగంలో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుంది. తాము తీసుకొచ్చిన ఇండస్ట్రియల్ పాలసీ టీఎస్ ఐపాస్ పనితీరు చాలా బాగుందని, రాష్ట్రంలో ఎవరైనా పెట్టుబడులు పెట్టాలంటే నేరుగా ఎవరిని కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేస్తే 15 రోజుల్లోనే కంపెనీ ఏర్పాటుకు అనుమతులు వస్తాయని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగం యూనిట్లు ఏర్పాటు చేస్తే అందుకు కావాల్సిన ముడిపదార్థాలను గ్రామీణ ప్రాంతాల నుంచి అందించేందుకు అధికారులు సహకారం అందిస్తారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని మంత్రి కేటీఆర్ కితాబిచ్చారు. దళితబంధు పథకం కింద ఇస్తున్న రూ.10 లక్షలతో నలుగురు కలిసి 40 లక్షలతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. చిన్న మధ్యతరగతి పారిశ్రామికవేత్తలను ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని వెల్లడించారు. తెలంగాణలో ఉత్తర, దక్షిణ భారతదేశానికి చెందిన ప్రజలు పనిచేస్తున్నారని తెలిపారు. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని, పత్తి పండిస్తున్న రాష్ట్రం కూడా తమదేనని పేర్కొన్నారు. టెక్స్?టైల్ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి కావలసిన ముడి పదార్థాలు రాష్ట్రం నుంచి లభిస్తాయన్నారు. విజయ డైరీ కూడా లాభాల బాటలో కొనసాగుతున్నదని మంత్రి కేటీఆర్ తెలిపారు.




హైదరాబాద్: భాగ్యనగర వాసులను ఉదయాన్నే వర్షం పలకరించింది. నిన్నంతా ఎండ వేడికి సతమతమైన నగర ప్రజలకు ఉపశమనం కల్పించేలా ఇవాళ తెల్లవారుజామునుంచే వర్షం కురుస్తోంది. నగరంలోని పలు ప్రాంతాల్లో మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతోంది. హిమాయత్‌నగర్, నారాయణగూడ, కేపీహెచ్‌బీ కాలనీ, సైదాబాద్, మలక్‌పేట, కార్వాన్, షేక్‌పేట, రాయదుర్గం, కాప్రా, చర్లపల్లి, ఈసీఐఎల్, కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్టలో వర్షం పడింది. సూరారం, అమీన్‌పూర్, సుచిత్ర, బాలానగర్, మంచాల, మారేడుపల్లి, నాచారం, మల్లాపూర్, మల్కాజిగిరిలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తోంది. సోమాజిగూడ, పంజాగుట్ట, అమీర్‌పేటలో భారీ వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

# రూ.30వేల కోట్ల సంపదను కారుచౌకగా కట్టబెట్టారు: రేవంత్ రెడ్డి



హైదరాబాద్: భాగ్యనగరానికి మణిహారంలా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అమ్మకానికి పెట్టిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ మేరకు పార్టీ ముఖ్య నేతలతో కలిసి గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు రూ.30వేల కోట్ల ఆదాయం వచ్చే ఔటర్ రింగ్ రోడ్డును రూ.7, 380 కోట్లకు కారుచౌకగా ముంబయి కంపెనీకి కట్టబెట్టారని రేవంత్ మండిపడ్డారు. దేశంలోనే ఇది అత్యంత పెద్ద కుంభకోణమని ఆరోపించారు. ఇందులో రూ.1,000 కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించబోదని.. అధికారంలోకి వచ్చాక దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తామన్నారు. యాజమాన్యం కూడా జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమేష్‌కుమార్, అరవింద్‌కుమార్, జయేష్ రంజన్ నిర్ణయాలన్నింటిపై కాంగ్రెస్ పార్టీ సమీక్షిస్తుందన్నారు. వీటిపై భాజపా ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను కేసీఆర్ అమ్ముతుంటే బండి సంజయ్, కిషన్ రెడ్డి ఎందుకు స్పందించడంలేదని రేవంత్ నిలదీశారు.

# నేడే కొత్త సచివాలయం ప్రారంభోత్సవం



హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయ భవనం ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉండటంతో హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు నగర ట్రాఫిక్ అదనపు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. వీవీ విగ్రహం, నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి జంక్షన్ వరకు ఇరువైపుల అప్పటి పరిస్థితులను బట్టి ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. ఆదివారం ఎన్టీఆర్ గార్డెన్, ఎన్టీఆర్ ఘాట్, నెక్లెస్ రోడ్డు, లుంబినీ పార్కులు మూసివేయనున్నట్లు అదనపు సీపీ వెల్లడించారు. ఆహ్వానితుల కోసం పార్కింగ్ స్థలాలు కేటాయించామని, సచివాలయానికి వచ్చే ఆహ్వానితులు తమ పాస్‌లను కార్ డోర్లకు అతికించుకోవాలని సూచించారు.

## ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

**ట్రాఫిక్ మళ్లింపు ఇలా..** అఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు ట్యాంక్‌బండ్‌పై నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు తెలుగుతల్లి ఫ్లై ఓవర్ నుంచి కట్టమైసమ్మ ఆలయం లోయర్ ట్యాంక్‌బండ్, డీబీఆర్ మిల్స్, కవాడిగూడ వైపునకు వెళ్లాలి. ఖైరదాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ వైపు నుంచి నెక్లెస్ రోటరీవైపు అనుమతి లేదు. ఈ వాహనాలను వీవీ విగ్రహం చౌరస్తా నుంచి సాదన్ కాలేజీ, నిరాంకరి వైపు మళ్లిస్తారు. నిరాంకరి చింతలబస్తీ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలకు ఖైరతాబాద్ ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లేందుకు వీలు ఉండదు. లిబర్టీ వైపు నుంచి తెలుగు తల్లి, అంబేద్కర్ విగ్రహం, తెలుగుతల్లి జంక్షన్ వైపు అనుమతి లేదు. ఈ వాహనాలు నేరుగా ఫ్లై ఓవర్ మీదకు వెళ్లి అక్కడి నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లాలి. ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఎన్టీఆర్‌మార్గ్ వైపు వాహనాలకు అనుమతి లేదు. ఈ వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్‌వైపు మళ్లిస్తారు. బీఆర్‌కే భవన్ వైపు నుంచి ఎన్టీఆర్‌మార్గ్‌కు వెళ్లే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్ వైపు మళ్లిస్తారు. బడా గణేశ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వచ్చే వాహనాలను బడా గణేశ్ నుంచి రాజ్‌దూత్ లైన్‌కు మళ్లిస్తారు.




హైదరాబాద్: భాగ్యనగరంలోని పలు ప్రాంతాల్లో ఇవాళ కురిసిన వర్షం బీభత్సం సృష్టిస్తోంది. సికింద్రాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి కళాసిగూడలోని నాలా ఫుట్‌పాత్ పైకప్పు నుంచి పడి 6 సంవత్సరాల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. కిరాణా వస్తువులు కొనుగోలు చేసేందుకు దుకాణానికి వెళ్తున్న క్రమంలో నాలాలో పడి కొంత దూరం కొట్టుకుపోయింది. ఇది గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది సాయంతో నాలాలోని చిన్నారి మృతదేహాన్ని బయటకు తీసి గాంధీ ఆస్పత్రికి తరలించారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్‌పై గుత్తా సుఖేందర్ తీవ్ర ఆగ్రహం... నన్నే అంటారా అంటూ..



నల్గొండ: కాంగ్రెస్ పార్టీపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ గ్రూపులుగా పాదయాత్ర చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగ నిరసన సభలో ఎన్నడూ కలవని వారిలా ఆలింగనాలు చేసుకోవడం ఏంటి అని విమర్శించారు. నిన్నటి సభలో సిగ్గు లేకుండా తామంతా కలిసి ఉన్నామనే సంకేతం ఇచ్చారని.. నిన్నటి కార్యక్రమంలో ఎవరి గుంపులు వారివే... వారెక్కడ కలిసినట్టు అని ప్రశ్నించారు. భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి మతిస్థిమితం లేకుండా సందర్భంలేని సమయంలో స్థిరత్వం లేకుండా తనను విమర్శించారని మండిపడ్డారు. ఈర్ష్య, భయంతో చరిత్రను మర్చిపోయిన ఆయనను నల్గొండలో తన మిత్రుడు భూపాల్ రెడ్డి ఓడించలేదా అని నిలదీశారు. ఉదయం బీఆర్ఎస్ పార్టీలోకి వస్తానని మధ్యాహ్నం కాంగ్రెస్, సాయంత్రం బీజేపీ అమిత్ షాతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యలు చేశారు. ఐదెకరాల భూమి ఉందన్న కోమటిరెడ్డికి హైదరాబాద్‌లో విల్లాలు, ఇతర ఆస్తులు ఎక్కడివని అడిగారు. జిల్లాలో రెండు పంటలకు నీళ్లిచ్చిన ఘనత కేసీఆర్ ది అని చెప్పుకొచ్చారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా 65 వేల కోట్ల రైతు బంధు, అకాల వర్షానికి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేలు ఇస్తున్నారన్నారు. జిల్లా మంత్రి జగదీష్ రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేశారని ఆగ్రహించారు. కాంగ్రెస్ నాయకులు బురద జల్లడం, రాజకీయ దురుద్దేశంతో ఉన్నారన్నారు. గతంలో చేసిన బ్లాక్ మెయిల్ విధానాలు అనుసరించే వారికి అధికారం ఇస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో అలాంటి వారికి సరైన గుణపాఠం చెప్పాలని గుత్తాసుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# టీడీపీలో చేరడంపై రాజాసింగ్ క్లారిటీ




హైదరాబాద్: టీడీపీలో చేరతారంటూ వస్తున్న వార్తలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ క్లారిటీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీలో తాను చేరటం లేదని... బీజేపీలో కొనసాగాలనేది తన అభిమతమన్నారు. బీజేపీ విధించిన సస్పెన్షన్ ఎత్తివేతపై ఆఖరి క్షణం వరకు ఎదురుచుస్తానని చెప్పారు. సస్పెన్షన్ ఎత్తివేయకుంటే రాజకీయాలకు దూరంగా జరిగి.. హిందూ ధర్మం కోసం పనిచేస్తానన్నారు. అలాగే టీడీపీ అధినేత చంద్రబాబుపై రాజాసింగ్ ప్రసంశల వర్షం కురిపించారు. తెలంగాణ అభివృద్ధికి కారణం చంద్రబాబు అని.. కేసీఆర్‌తో ఏమీ కాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మళ్ళీ గెలిచే అవకాశాలున్నాయని తెలిపారు. చంద్రబాబు అంటే తనకు చాలా గౌరవమని... రాజకీయంగా తనకు చంద్రబాబే లైఫ్ ఇచ్చారన్నారు. “గౌరవం ఉ ఒడటం వేరు.. రాజకీయాలు వేరు. ఆంధ్రాలో టీడీపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాను. నా మెంటాలిటీకి బీజేపీ మాత్రమే సూట్ అవుతుంది” అని రాజాసింగ్ పేర్కొన్నారు. కాగా.. రాజాసింగ్ 2009లో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచిన విషయం తెలిసిందే. అనంతరం బీజేపీలో చేరి 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2018లోనూ అదే స్థానం నుంచి రాజాసింగ్ గెలుపొందారు. అయితే ఓ వర్గంపై చేసిన వ్యాఖ్యల కారణంగా రాజాసింగ్ జైలుకు వెళ్లగా.. బీజేపీ అధిష్ఠానం ఆయనను సస్పెండ్ చేసింది. ఇప్పటికీ సస్పెన్షన్ ఎత్తివేతపై పార్టీ నిర్ణయం తీసుకోకపోవడంతో ఆయన టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా తాను టీడీపీలో చేరడం లేదంటూ రాజాసింగ్ చెప్పడంతో రూమర్లకు ఫుల్‌స్టాప్ పడినట్లైంది.

# 4 న ఢిల్లీలో బీఆర్ఎస్ ఆఫీస్ ప్రారంభం



హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముహూర్తం దాదాపుగా ఖరారైంది. మే నెల రెండో తేదీన ఢిల్లీ పర్యటనకు వెళ్తు న్న ముఖ్యమంత్రి కేసీఆర్... నాలుగో తేదీన ఢిల్లీ వసంత విహార్‌లో నిర్మించిన పార్టీ జాతీయ కార్యాలయ భవనాన్ని ప్రారంభించనున్నారు. జాతీయ రాజకీయాలపై సీరియస్‌గా దృష్టిపెట్టిన కేసీఆర్... ఢిల్లీలో కేంద్ర కార్యాలయ నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేశారు. తాజాగా భవన నిర్మాణం పూర్తికావటంతో ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు చేశారు. ఇది ఎన్నికల ఏడాది కావటంతో కేసీఆర్ మరింత స్పీడు పెంచారు. ఒకటి తర్వాత ఒకటి కీలక కార్యక్రమాలను పూర్తిచేస్తున్నారు. ఈక్రమంలోనే హైదరాబాద్ సాగరతీరంలో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని అంబేడ్కర్ జయంతి రోజున ప్రారంభించిన విషయం విదితమే. 30న నూతన సచివాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు. మే రెండో తేదీన ఢిల్లీ వెళ్తున్న కేసీఆర్... నాలుగో తేదీన పార్టీ కార్యాలయం ప్రారంభించిన తర్వాత హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. ఒకవేళ ఆయన ప్రయాణం వాయిదా పడితే నాలుగైదు రోజులు ఆయన ఢిల్లీలోనే ఉండే అవకాశాలున్నాయి

# అందువల్లే చిన్నారి మౌనిక ప్రాణం పోయింది... కిషన్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్: మ్యాన్‌హోల్‌లో పడి చిన్నారి మౌనిక మృతిచెందిన ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. శనివారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ... చిన్నారి మౌనిక మృతి చెందడం బాధాకరమన్నారు. రోడ్డును తవ్వేసి.. డ్రైనేజి పైప్‌లైన్ వేయాల్సి వస్తుంది కాబట్టి పనులు ఆపారని... ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం వల్ల ప్రాణం పోయిందని విమర్శించారు. కాంట్రాక్టర్లు పరిహారం ఇచ్చి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు చేసిన పనికి డబ్బులు ఇవ్వకపోవడం వల్లే పనులు ఆగుతున్నాయన్నారు. వేల రూపాయలు ఇస్తున్నామని, హైవేలు కడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం.. స్థానికంగా వీటిపై దృష్టి సారించడం లేదని వ్యాఖ్యలు చేశారు. వాటర్ పైప్ లైన్ కోసం తవ్వి విడిచిపెడుతున్నారని.. బస్తీలల్లో బాధలను ఎవ్వరు పట్టించుకోవడంలేదని కేంద్రమంత్రి తెలిపారు. జీతాలు ఇవ్వలేని, కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేని పరిస్థితి తెలంగాణ ప్రభుత్వానిదని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ వాళ్ళు భూముల కబ్జాల మీద బిజీగా ఉన్నారని, ప్రజలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మ్యాన్ హోల్ నాలాలు పైకప్పు లేని ప్రాంతాలు, డేంజ ర్‌గా ఉన్న ప్రాంతాలను గుర్తించి వర్షా కాలం దగ్గర పడుతుంది కాబట్టి త్వరితగతిన పనులు చేయాలని డిమాండ్ చేశారు. చిన్నారి మౌనిక కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం, జీహెచ్‌ఎంసీదే అని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కోటికిపైగా జనాభా ఉన్నారని తెలి పారు. జీహెచ్‌ఎంసీ, మెట్రో వాటర్ బోర్డుల్లో నిధుల కొరత వేధిస్తోందని, అసలు నిధులు ఎటు పోతున్నాయని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. బీజేపీ తరుపున కూడా బాధితులకు అండగా ఉంటామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

# హైదరాబాద్‌లో మార్చి నాటికి 640 ఈవీ బస్సులు.. దశల వారీగా అందుబాటులోకి

కాలుష్యాన్ని నివారించి.. ప్రజలకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతిని కలిగించేందుకు మరిన్ని ఈ- బస్సులను తీసుకొస్తున్నది గ్రేటర్ ఆర్టీసీ. వచ్చే మార్చి నాటికి దశల వారీగా 640 ఎలక్ట్రిక్ బస్సులు సిటీ రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. అందులో 620 నాన్ ఏసీలు కాగా, మిగతావి ఏసీ సర్వీసులు. తొలుత జూన్ నాటికి 28 ఎలక్ట్రిక్ బస్సులను రోడ్డెక్కించనున్నారు. సెప్టెంబర్ వరకు 137, డిసెంబర్ నాటికల్లా 205, మిగిలినవి మార్చికల్లా అందుబాటులోకి వస్తాయి. ఈ నిర్ణయంతో నగరంలో భారీగా శబ్ద, వాయు కాలుష్యం తగ్గనున్నది. విద్యుత్ బస్సులకు రెండు గంటలు చార్జింగ్ చేస్తే 200 కిలోమీటర్ల వరకు ప్రయాణం చేసే అవకాశాలున్నాయి. తొలుత గుర్తించిన డిపోల్లో 33 కేవీ చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఎలక్ట్రిక్ సర్వీసులు అందుబాటులోకి రాగానే ప్రస్తుతం నడుస్తున్న కాలం చెల్లిన 300 బస్సులను తుక్కు కింద పరిగణిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో నగరంలో వాయు కాలుష్యంతోపాటు ధ్వని కాలుష్యం కూడా బాగా తగ్గిపోనున్నది. గ్రేటర్ హైదరాబాద్ రోడ్లపై త్వరలో 640 విద్యుత్ బస్సులు రయ్ రయ్ మంటూ దూసుకుపోనున్నాయి. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ బస్సులు నగరానికి చేరుకోనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఈ బస్సులు ఒకేసారి కాకుండా విడుతల వారీగా నగరానికి చేరుకోబోతున్నాయి. అయితే ఈ జూన్ నాటికి తొలుత 28 బస్సులు, సెప్టెంబర్‌కు 137, డిసెంబర్ వరకు 205 బస్సులు సిటీకి ఈవీ బస్సులు వస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మిగిలిన 270 బస్సులు వచ్చే ఏడాది మార్చి లోగా ఆర్టీసీకి అప్పగించే విధంగా ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నది. సిటీకి వచ్చే 640 విద్యుత్ బస్సుల్లో 620 బస్సులు నాన్ ఏసీగా రూపొందిస్తున్నారు. మరో 20 బస్సులు మాత్రం ఏసీగా మార్పులు చేసి, ఎయిర్‌పోర్టు మార్గంలో నడిపించడానికి ఆర్టీసీ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతో ఎయిర్‌పోర్టుకు తిరిగే పుష్పక్ ఈవీ బస్సుల సంఖ్య 60కి చేరుకుంటుంది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com